Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 261 మేడ్చల్ మల్కాజ్‌గిరి 10 అక్టోబర్ 2023 మంగళవారం పేజీలు : 4

## కులాల సర్వే ఇప్పటి తక్షణావసరం...

### కుండబద్దలు కొట్టిన సంజయ్ రౌత్

ముంబై: కులాల సర్వేకు విపక్ష 'ఇండియా' కూటమి సహా సమాజంలోని అన్ని వర్గాలు సానుకూలంగా ఉన్నాయని, కులాల సర్వే చేపట్టడం ఇప్పటి తక్షణ అవసరమని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. బీహార్‌లోని నితీష్ కుమార్ ప్రభుత్వం ఇటీవల కులాల సర్వే గణాంకాలను ప్రకటించడం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు సైతం కులగణనకు సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో సంజయ్ రౌత్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 'బీహార్‌లో కులాల సర్వే జరిగింది. రాజస్థాన్‌లోనూ చేపడుతున్నారు. మహారాష్ట్రలో కూడా ఈ డిమాండ్ ఉంది. కులాల సర్వే అనేది ఇప్పటి తక్షణావసరం. సమాజంలోని అన్ని వర్గాలు, ఇండియా కూటమి సైతం ఇందుకు అనుకూలం" అని రౌత్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

# నవంబరు 30న తెలంగాణ ఎన్నికలు..




## ఐదు రాష్ట్రాలకు షెడ్యూల్ విడుదల

దిల్లీ: దేశంలో మరోసారి ఎన్నికల సందడి మొదలైంది. తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరం రాష్ట్రాలకు శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఐదు రాష్ట్రాల్లోని మొత్తం 679 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నేటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఈసీ తెలిపింది. తెలంగాణలో నవంబరు 30న, రాజస్థాన్‌లో నవంబరు 23న, మధ్యప్రదేశ్‌లో నవంబరు 17న, మిజోరంలో నవంబరు 7న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఛత్తీస్‌గఢ్‌లో నవంబరు 7న తొలి విడత, నవంబరు 17న రెండో విడతలో ఓటింగ్ నిర్వహించనున్నారు. ఐదు రాష్ట్రాల్లో డిసెంబరు 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. తెలంగాణలో 3.17కోట్లు, రాజస్థాన్‌లో 5.25కోట్లు, మధ్యప్రదేశ్‌లో 5.6 కోట్లు, ఛత్తీస్‌గఢ్‌లో 2.03కోట్లు, మిజోరంలో 8.52లక్షల ఓటర్లున్నారు.

**తెలంగాణలో ఓటర్ల వివరాలు ఇలా..** తెలంగాణలో మొత్తం 3.17 కోట్ల ఓటర్లున్నారు. ఇందులో పురుష ఓటర్లు 1.58 కోట్లు, మహిళా ఓట ర్లు 1.58 కోట్లు. తొలిసారి ఓటు హక్కు వచ్చినవారు 8.11లక్షలు (18–19ఏళ్ల వయసు). దివ్యాంగులు 5.06లక్షలు. 80ఏళ్ల వయసు పైబ డిన వారు 4.4లక్షలు (వీరికి ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది). వందేళ్ల వయసు దాటిన ఓటర్లు 7005 మం ది ఉన్నారు. ఈ సారి కొత్తగా చేరిన ఓటర్ల సంఖ్య 17,01,087గా ఉంది. రాష్ట్రంలో మొత్తం 35,356 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఈసీ తెలిపింది. ఇందులో వెబ్‌క్యాస్టింగ్ ఉండే కేంద్రాలు 27798 (78శాతం). 597 మహిళా పోలింగ్ కేంద్రాలు, 644 మోడల్ పోలింగ్ కేంద్రాలు, 120 దివ్యాంగ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. మొత్తం 148 చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. తెలంగాణలో మొత్తం 119 నియోజకవర్గాలుండగా.. మధ్యప్రదేశ్‌లో 230, రాజస్థాన్ లో 200, ఛత్తీస్‌గఢ్ లో 90, మిజోరంలో 40 అసెంబ్లీ స్థానాలున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో భారాస, మధ్యప్రదేశ్‌లో భాజపా, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్, మిజోరంలో మిజో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉంది.

### తెలంగాణ ఎన్నికల షెడ్యూల్

- నోటిఫికేషన్ : నవంబరు 3
- నామినేషన్లకు ఆఖరు తేదీ : నవంబరు 10
- నామినేషన్ల పరిశీలన : నవంబరు 13
- ఉపసంహరణకు ఆఖరు తేదీ: నవంబరు 15
- పోలింగ్ తేదీ : నవంబరు 30
- ఓట్ల లెక్కింపు : డిసెంబరు 3




### తెలంగాణలో మొత్తం ఓటర్లు ఎంత మంది..? ఇన్ని ఓట్లు తొలగించారా..?

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తెలంగాణతో సహా ఐదు రాష్ట్రాలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ సీఈసీ చీఫ్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. నేటి నుంచే ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. ఈ సందర్భంగా తెలంగాణలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు..? ఎంత మంది కొత్తగా ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు..? రాష్ట్రంలో ఎన్ని ఓట్లు తొలగించారు..? 18–19 ఏళ్ల వయస్సు ఓటర్లు ఎంత మంది ఉన్నారు..? అనే విషయాలను ఎన్నికల కమిషనర్ నిశితంగా వివరించారు.

**ఎంత మంది ఓటర్లు..?** మొత్తం ఓటర్ల సంఖ్య : 3.17,17,389 మంది, 18–19 ఏళ్ల వయస్సు ఓటర్లు : 3,35,043 మంది, కొత్త ఓటర్లు : 17,01,087 మంది, తొలగించిన ఓట్లు : 6,10,694 మంది, పోలింగ్ కేంద్రాల సంఖ్య : 35,356 పోలింగ్ స్టేషన్లు, పట్టణ ప్రాంతాల్లో : 14,484 పోలింగ్ స్టేషన్లు, గ్రామీణ ప్రాంతాల్లో : 20,892 పోలింగ్ స్టేషన్లు,.

# కాంగ్రెస్‌తోనే కమ్యూనిస్టులు..

ఖమ్మం: తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తోనే కమ్యూనిస్టులు నడిచేందుకు సిద్ధమయ్యారు. సోమవారం నాడు కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎర్రపార్టీలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. సీపీఐ, సీపీఎం పార్టీలకు చెరో రెండు సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. మొదటగా రెండు పార్టీలకు చెరొక సీటు ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. అయితే కమ్యూనిస్టులు ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. దీంతో చెరో రెండు స్థానాల్లో టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. సీపీఐకి కొత్తగూడెం, మునుగోడు నియోజకవర్గాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. సీపీఎంకు భద్రాచలం, మిర్యాలగూడ ఇవ్వాలని అనుకుంటోంది. భద్రాచలం నియోజకవర్గంలో ఇప్పటికే అక్కడ కాంగ్రెస్‌కు సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ సీపీఎంకి ఇవ్వాలని స్క్రీనింగ్ కమిటీలో నిర్ణయం తీసుకుంది. భద్రాచలం సిట్టింగ్ ఎమ్మెల్యే పోడెం వీరయ్యను పినపాక నియోజకవర్గానికి పంపాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. పాలేరు, ఖమ్మం నుంచి టికెట్లు కావాలని కమ్యూనిస్టులు పట్టుబట్టారు. కానీ అక్కడ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాలేరు నుంచి పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పాలేరు నియోజకవర్గంలో ప్రచారాన్ని సైతం ముమ్మరంగా చేస్తున్నారు. ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వరరావు బరిలో నిలవనున్నారు. దీంతో కమ్యూనిస్టులకు కాంగ్రెస్ పార్టీ అక్కడి నుంచి టికెట్లు ఇచ్చేందుకు నిరాకరించింది.




# రేపో మాపో పులి బయటకు వస్తది

## పరకాలలో మంత్రి కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు



పరకాల : రేపో మాపో పులి బయటకు వస్తది.. వచ్చిన తర్వాత ఇవాళ ఎగిరెగిరి పడుతున్న నక్కలన్నీ మళ్లా తొర్రలకే పోతాయని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ హయాంలో రూ. 200 పెన్షన్ ఇచ్చేటోళ్లు అని కేటీఆర్ గుర్తు చేశారు. అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వం రూ. 75 పెన్షన్ ఇచ్చేది. ఇవాళ మీరంతా కేసీఆర్‌ను గెలిపించుకున్న తర్వాత 200 ఉన్న పెన్షన్ 10 రెట్లు పెరిగింది. రూ. 2 వేల పెన్షన్ అయింది. దివ్యాంగులకు పెన్షన్లు పెంచాం. కాంగ్రెస్ హయాంలో 29 లక్షల మందికి పెన్షన్లు వచ్చేవి. ఇప్పుడు 46 లక్షల మందికి పెన్షన్లు వస్తున్నాయి. బీడీలు చుట్టే అక్కాచెల్లెళ్లు 16 రాష్ట్రాల్లో ఉన్నారు. ఏ ఒక్క రాష్ట్రంలోనైనా బీడీ కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నారా..? ఆ దిశగా ఆలోచించే ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా..? రెండున్నర లక్షల మంది ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇచ్చే ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా..? అని కేటీఆర్ నిలదీశారు. మన దగ్గర ఊరికి పదో, పదిహేను మంది బీడీ కార్మికులు మిగిలిపోయి ఉంటారు.. తప్పకుండా వారిని కూడా కడుపులో పెట్టి చూసుకుంటాం.. మిగిలిపోయిన వారికి కూడా పెన్షన్లు ఇచ్చే బాధ్యత మాది అని కేటీఆర్ స్పష్టం చేశారు. మీ మనసులో ఉన్న కోరిక కేసీఆర్‌కు తెలుసు. మీరు ఏమనుకుంటున్నారో తెలుసు. మరి కాంగ్రెసోడు కూడా చెప్పవట్టే కదా..? బీజేపోడు కూడా నరకవట్టే కదా..? మరి కేసీఆర్ చెప్పకపాయే.. ఏం సంగతి అని ఊర్లల్ల ఎదురుచూస్తున్నారు.. అది మాకు తెలుసు. కేసీఆర్ మొత్తం లెక్కాపత్రం రాసుకుంటున్నారు. రేపో మాపో పులి బయటకు వస్తది. వచ్చిన తర్వాత ఇవాళ ఎగిరెగిరి పడుతున్న నక్కలన్నీ మళ్లా తొర్రలకే పోతాయి. రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి.. ఇవాళ ఎగిరెగిరి పడుతున్న నక్కలు, నీలుగుతున్న నక్కలు, మూలుగుతున్న తోడేండ్లు అన్ని మళ్లా తొర్రలకే పోతాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎన్నికల వేళ ఏం ఏం చేయాలని కేసీఆర్ అన్ని లెక్కలు తీస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఎందుకంటే మనం ఏం మాట్లాడినా బాధ్యతతో మాట్లాడుతాం. వానిది ఏం పోయింది కాంగ్రెసోనిది. నెత్తి వాన్ది కాదు.. కత్తి వాన్ది కాదు.. ఎటువడితే అటు గీకుతాడు. గెలిచేది లేదు, పీకేది లేదు. ఎటువడితే అటు మాట్లాడుడే. కాంగ్రెస్‌ను నమ్మే బుద్ధి తక్కువ పరిస్థితిలో మనం ఉన్నామా? 60 ఏండ్లు మనల్ని వేధించారు. ఇవాళ వచ్చి ప్రశ్నలు వేస్తుంటే గమ్మత్తు అనిపిస్తుందని కేటీఆర్ అన్నారు.

# 15 నుంచి సీఎం కేసీఆర్ జిల్లాల పర్యటన

## హుస్నాబాద్‌లో భారీ బహిరంగ సభ



హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికార పార్టీ భారీ బహిరంగ సభలకు ప్రణాళిక సిద్ధం చేసింది. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికల శంఖారావం పూరించేందుకు గులాబీ బాస్ సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అక్టోబర్ 15వ తేదీ నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. 15న హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహించే బహిరంగ సభలో సాయంత్రం 4 గంటలకు సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. 16వ తేదీన జనగామ, భువనగిరి నియోజకవర్గాల్లో, 17న సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లో, 18న జడ్చర్ల నియోజకవర్గంలో 2 గంటలకు, సాయంత్రం 4 గంటలకు మేడ్చల్ నియోజకవర్గంలో నిర్వహించే బహిరంగ సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొంటారు. ఈ నెల 15న భారత రాష్ట్ర సమితి అభ్యర్థులతో సమావేశం కానున్నారు. తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో అభ్యర్థులకు బీ ఫారాలను అందజేయనున్నారు. ఇక అదేరోజున పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించనున్నారు.

# జిల్లా ఆసుపత్రిలో భూగర్భ విద్యుత్తు

కరీంనగర్ : జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుసంధానం చేశారు. త్వరలో వైద్య, విధాన పరిషత్ ఆధ్వర్యంలో ఉన్న ఈ దవాఖానాను వైద్య కళాశాల పరిధిలోకి మారిపోనుంది. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు కూడా త్వరితగతిన జరుగుతున్నాయి. జిల్లా ఆసుపత్రిలో ఉన్న విద్యుత్తు వ్యవస్థను మార్చేస్తుంది. భూగర్భ విద్యుత్తు వ్యవస్థకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతోపాటు రూ.కోటి అంచనా వ్యయంతో టెండర్ ఖరారు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభంకానున్నాయి. ఈ విధానంతో ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందో వివరిస్తూ 'న్యూస్‌టుడే' కథనం. ఇప్పటి వరకు ఇలా..జిల్లా ఆసుపత్రి ఆవరణలో ప్రస్తుతం 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీనికి అనుసంధానంగా 15కిపైగా స్తంభాలున్నాయి. నూతనంగా ఏర్పాటు చేసిన వార్డులకు కరెంటు సౌకర్యం కావాలనుకున్నప్పుడు అప్పటికప్పుడు కొత్త కనెక్షన్లు ఇవ్వడంతో ఓవర్‌లోడ్ సమస్య ఏర్పడి పలు యంత్రాలు కాలిపోయిన ఘటనలున్నాయి. పెద్దఎత్తున గాలులు వీచినప్పుడు, వర్షాల సమయంలో ఆసుపత్రిలో భారీగా పెరిగిన వృక్షాలతో తీగలు తెగిపోయేవి. కరెంటు సమస్యలు ఉండకూడదని రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఏర్పడిన 9 వైద్య కళాశాలలో భూగర్భ కరెంట్‌కు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ తెలిపారు.

సమస్యలు ఉత్పన్నం కాకుండా..




అధిక సామర్థ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ప్రస్తుతం ఉన్న 315 కేవీఏ నియంత్రికకు బదులు 500 కేవీఏ నియంత్రిక ఏర్పాటు చేయనున్నారు. స్తంభాలన్నీ తొలగించి పూర్తిగా భూగర్భ కరెంట్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. ఏ వార్డులో ఎంత విద్యుత్తు అవసరం ఉంటుంది. భవిష్యత్తులో మరిన్నీ యంత్రాలు వస్తే కూడా సమస్యను అధిగమించేందుకు ఏర్పాటు చేశారు. ప్రతి వార్డుకు ప్రత్యేక బ్రేకర్ సౌకర్యంతోపాటు కరెంటుతో చిన్న ప్రమాదం కూడా జరగకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ పనులను టీఎస్ఎంఎస్ఐఎస్‌డీసీ (తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) వారు చూస్తున్నారు.

ప్రణాళిక సిద్ధం– కె.ఉష, డీఈ, టీఎస్ఎంఎస్ఐఎస్‌డీసీ

ఆసుపత్రుల్లో రోగులకు, బంధువులకు విద్యుత్తుతో ఎలాంటి ప్రమాదం ఉండకూడదని భూగర్భ వ్యవస్థ కరెంట్‌కు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రూ.కోటి వ్యయంతో పనులకు ఏజెన్సీ నిర్వాహకులు ఆసుపత్రి అంత చూసి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఉన్నతాధికారుల అనుమతి పొందిన అనంతరం త్వరలోనే పనులు జరగనున్నాయి. షార్ట్‌సర్క్యూట్, గాలివానలతో స్తంభాలు పడిపోవడం, తీగలు తెగిపోవడంలాంటి సమస్యలు ఉండవు.

# దూదిపూల దుఃఖం

నల్గొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులతో పత్తి పంట దిగుబడి సగానికి సగం తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతంతో పత్తికి నష్టం వాటిల్లగా.. చాలా ప్రాంతాల్లో నీటి సదుపాయం, వర్షాలు లేకపోవడంతో పంటలో ఎదుగుదల లోపించింది. గతేడాదితో పోలిస్తే ఈ దఫా పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పుడిప్పుడే జిల్లాలోని పలు చోట్ల పత్తి తొలిదశ తీయడం ప్రారంభమైంది. తొలకరిలో కొంత ఆశాజనకంగా వర్షాలు పడటంతో రైతులు పత్తి సాగు చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి జిల్లాలోనే పత్తి పంట సాగు చేస్తుండటం గమనార్హం. తొలకరి అనంతరం జులైలో కొంత ఆశాజనకంగా వర్షాలు పడినా...ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పెద్ద వర్షాలు లేకపోవడం, తెగుళ్లు సోకడంతో దిగుబడులు అమాంతం పడిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పత్తి పంట సాధారణ సాగు విస్తీర్ణం 9.37 లక్షల ఎకరాలు కాగా...ఈ ఏడాది 1.61 తక్కువగా 7.76 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. గతేడాది ఇది 8.58 లక్షల ఎకరాలు ఉండటం విశేషం.సీసీఐ కరుణ చూపేనా?మద్దతు ధరకు కొనే భారత పత్తి సంస్థ (సీసీఐ) ఈ ఏడాది తమపై కరుణ చూపిస్తేందేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గత రెండు సీజన్లుగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే మార్కెట్లోనే ఎక్కువ ధరలు ఉండటంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఈ దఫా ఇప్పుడిప్పుడే తొలి దశ పత్తి తీయడం ప్రారంభమైన నేపథ్యంలో సూర్యాపేట, మునుగోడు, దేవరకొండ, నల్గొండ, భువనగిరి, తిరుమలగిరి ప్రాంతాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 65 జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. సీజన్‌లో 20 లక్షల పత్తిబేళ్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఈ మిల్లులకు ఉంది. సీసీఐ రైతుల నుంచి మద్దతు ధరకు కొంటే వ్యాపారులు రైతులను దోచుకునే పరిస్థితి ఉండదు. ఇప్పటికైనా మూడు జిల్లాల అధికార యంత్రాంగాలు స్పందించి సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకుంటేనే వ్యాపారుల దోపిడీకి అడ్డుకట్టు పడనుంది.

ధరలు తగ్గుముఖం

ధమార్కెట్లో పత్తి ధర సైతం గతేడాదితో పోలిస్తే పడిపోయింది. ప్రస్తుతం రూ.6500 నుంచి రూ.7,000 మధ్యలో ఉంది. గతేడాది ఇది రూ.8500 వరకు ఉంది. ప్రభుత్వ మద్దతు ధర నాణ్యత కలిగిన పత్తికి రూ.7020, నాణ్యత తగ్గితే రూ.6620గా ఉంది. ప్రస్తుతం అక్కడక్కడ మోస్తారు వర్షాలు పడుతుండటంతో పత్తి కొంత తడుస్తోంది. దీంతో వ్యాపారులు రూ. 5 వేల లోపే చెల్లిస్తున్నారని మునుగోడుకు చెందిన కొమ్ము మల్లేశ్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా పత్తికి సకాలంలో వర్షాలు పడి, ఎదుగుదల బాగుంటే మూడు విడుతలుగా తీస్తే ఎకరాకు 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. 10 క్వింటాళ్ల వరకూ రైతులకు దిగుబడి వచ్చిన సందర్భాలున్నాయి. అయితే ఈ దఫా 3 నుంచి 5 క్వింటాళ్లకు దిగుబడులు మించవని రైతులు అభిప్రాయపడుతున్నారు.పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు– గంట గణపతి, రైతు, శిర్దేపల్లి, చండూరు మండలంనాకున్న పదెకరాలతో పాటు మరో ఐదెకరాలను కౌలుకు తీసుకొని పత్తి వేశాను. పెట్టుబడికి రూ.4 లక్షల వరకు ఖర్చు చేశాను. దిగుబడి నాలుగైదు క్వింటాళ్ల కంటే ఎక్కువ వచ్చే పరిస్థితి లేదు. ధరలు ఇలాగే ఉంటే పెట్టిన పెట్టుబడి కూడా రాదు.

# వలస కార్మికులకు ఈ-కేవైసీ కష్టాలు



జగిత్యాల: పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో చౌకధరల దుకాణాల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం బోగస్ లబ్ధిదారులను ఏరి వేసేందుకు ఈ–కేవైసీ ప్రక్రియ చేపట్టింది. రేషన్‌కార్డుదారులు ఈ–కేవైసీ వివరాలు నమోదు చేయాలంటూ ప్రభుత్వం షరతు విధించడంతో పలు విషయాల్లో అస్పష్టత ఉందంటూ వినియోగదారులు వాపోతున్నారు. కార్డుల్లో పేర్లు నమోదై ఉన్నవారు ఇతర ప్రాంతాలకు వెళ్లినా, మృతిచెందినా సరైన వివరాలు అందుబాటులో లేవని పౌరసరఫరాల శాఖ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని నిలిపి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేసినా నమోదు కొనసాగుతోంది.

నమోదుపై అస్పష్టత

రేషన్‌కార్డుల్లో వివరాలు ఉన్నవారు కచ్చితంగా వేలిముద్రలు వేసుకోవాలని కొందరు చెబుతుండగా, స్వదేశంలో ఉన్న యజమాని వేలిముద్రలు వేసి ఇతర సభ్యుల ఫొటోలు జతచేస్తే సరిపోతుందని మరికొందరు పేర్కొంటున్నారు. స్వదేశంలో హైదరాబాద్, ముంబయి తదితర ప్రాంతాలతో పాటు ఎక్కడ ఉన్నా ఈకేవైసీలో వివరాలు నమోదు చేసుకోవచ్చని రేషన్ డీలర్లు పేర్కొంటున్నారు. విదేశాల్లో ఉన్నవారు మాత్రం స్వదేశానికి వస్తేనే ఈకేవైసీ వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉందని చెబుతుండగా అక్కడి నుంచి రావాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని గల్ఫ్ సహా ఇతర దేశాల్లోని వారి కుటుంబసభ్యులు వాపోతున్నారు. తాము రాలేని పక్షంలో పేర్లు తొలగిస్తే ఆయుష్మాన్ భారత్ సహా రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు తాము అనర్హులమవుతామని చెబుతున్నారు. అక్టోబరు 30లోగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలంటూ తొలుత చెప్పినా, డిసెంబరు 31 వరకు గడువుందని అధికారులు ప్రకటించారు. స్థానికంగా ఉన్నవారు ఎలాగోలా వివరాలు నమోదు చేసుకుంటారని, ఇతర ప్రాంతాల వారు నష్టపోయే అవకాశముందని పేర్కొంటున్నారు.

కష్టాలు సరేసరి

రేషన్ దుకాణాల్లో ఈ–పాస్ యంత్రం ద్వారా వేలిముద్రల సేకరణ చేస్తున్నారు. ఈ సమయంలో చాలా మంది వేలిముద్రలు పనిచేయకపోవడంతో ఆధార్ కేంద్రాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. రేషన్ దుకాణాల్లో నెట్‌వర్క్ సమస్య తలెత్తినప్పుడు కూడా వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారులు, వృద్ధులకు వేలిముద్రలు సహా ఐరిస్ కూడా సరిగా నమోదు కావడం లేదు.


వలసదారులపై ప్రకటన రాలేదు

– వెంకటేశ్వర్ రావు, డీఎస్వో, జగిత్యాల

ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో ఈకేవైసీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. దేశంలో ఎక్కడ ఉన్నా అక్కడే తమ వివరాలను బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఇతర దేశాల్లోని వారి విషయమై ఇంకా ప్రకటన రాలేదు. దేశంలో ఉన్నవారు మాత్రం ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వలసదారులకు సంబంధించి ప్రకటన రాగానే అమలు చేస్తాం.

గల్ఫ్ కార్మిక కుటుంబాల్లో ఆందోళనఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 3.50 లక్షల మంది గల్ఫ్ దేశాల్లో ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి పెద్దఎత్తున గల్ఫ్ దేశాలకు వలస వెళ్లగా కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల నుంచి ఆయా దేశాలకు తక్కువ సంఖ్యలో ఉపాధి కోసం వెళ్లారు. యూఏఈ, సౌదీ అరేబియా, బెహరాన్, ఒమన్, దోహా ఖతర్ తదితర దేశాలకు లక్షల సంఖ్యలో వలస వెళ్లారు. వీరితో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, సింగపూర్ లాంటి దేశాలకు 50 వేలకు పైగానే వెళ్లారు. ప్రస్తుతం ఈకేవైసీ పేరిట లబ్ధిదారుల వేలిముద్రలు సేకరిస్తుండటంతో ఇతర దేశాల్లోని వారు రాకపోతే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి చౌకధరల దుకాణాలు అందించే సౌకర్యాల కన్నా రేషన్‌కార్డుల్లో తమ పేరుంటే ఇతర ప్రభుత్వ పథకాల మూలంగా లబ్ధి పొందే అవకాశముందని వారు భావిస్తున్నారు. తాము ఈకేవైసీలో వివరాలు నమోదు చేయాలంటే కచ్చితంగా స్వదేశంలో ఉండాలన్న నిబంధన ఉండటం తమకు శాపంగా మారిందని పలువురు వాపోతున్నారు. ఈకేవైసీ నమోదులో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో 8వ స్థానంలో ఉండగా కరీంనగర్ 15, జగిత్యాల 26, పెద్దపల్లి 27వ స్థానంలో ఉన్నాయి.

# అనర్హులకు డబుల్ ఇళ్లు



జగిత్యాల: జిల్లా కేంద్రంలో ఇళ్లు లేని పేదల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నూకపల్లి అర్బన్ కాలనీలో 4,520 రెండు పడకల గదుల ఇళ్లు నిర్మించగా.. రెండురోజుల క్రితం రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల కోసం అయిదారేళ్ల నుంచి సుమారు 13,200 మంది దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పరిశీలన జరిపి 4,048 మందిని అర్హులుగా తేల్చారు. అయినప్పటికీ మళ్లీ పరిశీలించాలని ఒత్తిళ్లు రావడంతో వివిధ శాఖల అధికారులతో మరోసారి దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలన జరిపి 3,722 మందిని అర్హులుగా తేల్చి పట్టాలు పంపిణీ చేశారు.

కార్యాలయాలకు పరుగులు రెండ్రోజులుగా తాము అర్హులమైనప్పటికీ తమకు ఇళ్లు రాలేదంటూ తహసీల్ కార్యాలయం, కలెక్టరేట్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం చుట్టూ దరఖాస్తుదారులు తిరుగుతున్నారు. మొదట 4,048 మందిని అర్హులుగా తేల్చి ప్రభుత్వానికి పంపినప్పటికీ సాంకేతిక కారణాలతో కొన్ని దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అందులో అనేకమంది అత్యంత నిరుపేదలు సైతం ఉన్నారు. పట్టాలు పొందినవారిలో అనేకమంది అనర్హులు, ఇతర గ్రామాలకు చెందిన వారు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. జగిత్యాల పట్టణంలో ఆహార భద్రత కార్డు ఉండి ఇళ్లు, నివాస స్థలం లేనివారు అర్హులు ఉండగా ఆస్తులు ఉన్నవారు, వివిధ మండలాలకు చెందిన వారికి ఇళ్లు దక్కడంతో అధికారులు ఆలోచనలో పడ్డారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా వెంటనే విచారణ జరపాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన జరపగా కొందరు అనర్హులకు ఇళ్లు దక్కినట్లు తేలింది. అందులో బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన వారే 9 మంది ఉన్నట్లు భావిస్తున్నారు. అనర్హులకు ఇళ్లు దక్కడం, అర్హులకు రాకపోవడంతో కొందరు ప్రజాప్రతినిధులు, కిందిస్థాయి అధికారుల హస్తం ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని కొందరు డబ్బులు సైతం వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పూర్తిస్థాయి విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఇళ్లు రాని అర్హులైన పేదలు రెండ్రోజులుగా తహసీల్ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపునకు తరలివస్తున్నారు. దీంతో పట్టణ సీఐ సీహెచ్ నటేశ్, నాయబ్ తహసీల్దార్ గంద్ర రాజేందర్ రావు దరఖాస్తుదారులకు నచ్చజెప్పి పంపిస్తున్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం– బీఎస్ లత, అదనపు కలెక్టర్

రెండు పడక గదుల ఇళ్ల కాలనీలో అనర్హులకు ఇళ్లు దక్కాయనే విషయమై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే బీర్‌పూర్ మండలానికి చెందిన 9 మందికి ఇళ్లు దక్కినట్లు గుర్తించాం. దీనికి గృహనిర్మాణ శాఖలో పొరుగుసేవల ఉద్యోగి కారణమని తెలిసింది. అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. అనర్హులకు మంజూరైన ఇళ్లను రద్దు చేసి అర్హులకు కేటాయిస్తాం. సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురైన దరఖాస్తులను మరోసారి పరిశీలించి అర్హులైన వారికి ఇళ్లు అందేలా చూస్తాం.

# సాగర్ ఆయకట్టు రైతులకు ఊరట

మోత్కూరు : నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులకు ఊరట. నాగార్జునసాగర్ ఆయకట్టుకు ఒక తడి సాగు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయం ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, నోముల భగత్ వేర్వేరుగా 'న్యూస్‌టుడే'కు తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట (కొంత మేర) నియోజకవర్గాల్లో సాగర్ ఆయకట్టు విస్తరించి ఉంది. సాగర్ జలాలు వస్తాయనే ఆలోచనతో రైతులు వరినాట్లు వేశారు. బోరు, బావులు లేని రైతులు మాత్రమే నాట్లు వేయలేదు. కృష్ణా పరివాహక ప్రాంతం, సాగర్ ఆయకట్టులో వర్షాభావంతో ప్రాజెక్టులోకి నీరు రాలేదు. దీంతో అప్పుడప్పుడు కురిసే వర్షాలతో పంటలను రక్షించుకుంటున్నారు. మరో వైపు వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు పడిపోయి బోర్లు, బావులతో పంటలను రక్షించుకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు. కొన్ని చోట్ల విద్యుత్తు పూర్తిస్థాయిలో ఉండక ట్రాక్టర్ ఇంజిన్ల అనుసంధానంతో పంపులు నడుపుకుంటున్న పరిస్థితి ఉంది.

# పట్టించుకోండి.. పుట్టంగండి..!

మోత్కూరు : జిల్లా ఆశలసౌధం ఏఎమ్మార్ ప్రాజెక్టులో ప్రధాన భాగమైన పుట్టంగండి సిస్టర్న్ ఆనకట్టను నాణ్యతాలోపాలు వెంటాడుతూనే ఉన్నాయి... రెండు దశాబ్దాల క్రితం రూపుదిద్దుకున్న ఈ ఆనకట్ట నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా.. పనులు చేపట్టిన ఏజెన్సీ నాణ్యతను విస్మరించింది. దీనిమూలంగా ప్రాజెక్టు ప్రారంభించిన కొద్దిరోజులకే ఆనకట్ట పలుచోట్ల లీకేజీలకు గురైంది. ఇన్‌టేక్ స్ట్రక్చర్ నుంచి పలుచోట్ల నీరు బయటకు రావడంతో ప్రమాదఘంటికలు మోగాయి. ఇసుక బస్తాలు వేసి ఏళ్ల తరబడి లీకేజీలను తాత్కాలికంగా అరికట్టారు. తర్వాత ఇన్‌టేక్ స్ట్రక్చర్‌ను ఆనుకుని లోపలివైపు రక్షణగోడతోపాటు ఆనకట్ట 30 మీటర్లు కూలిపోవడంతో హుటాహుటిన రాక్‌ఫిల్‌డ్యాం, ఇన్‌టేక్ స్ట్రక్చర్ వెనుకవైపున సిమెంటు నిర్మాణం చేపట్టి లీకేజీలు నివారించారు. ఆ తర్వాత లీకేజీలు కాకుండా ఆనకట్ట ఎత్తుపెంచి మట్టిపోయడంతో లోపలివైపు రక్షణగోడ పూర్తిగా మునిగిపోయి శిథిలావస్థకు చేరుకుంది. 2.3 కిలోమీటర్ల పొడవున్న ఆనకట్ట 0.994 కిలోమీటరు నుంచి 1.85 కిలోమీటరు వరకు రక్షణగోడ కూలిపోయింది. కొన్నిచోట్ల లోపలికి వంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆనకట్టపై



ఏ చిన్న వాహనంసైతం ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది.

మంజూరు కాని నిధులు...

సిస్టర్న్ మరమ్మతులకు ఏడాది క్రితం ప్రాజెక్టు అధికారులు రూ.40 లక్షలతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. కానీ ఇప్పటి వరకు నిధుల మంజూరు లేకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో డ్యాం భద్రతా బృందం సందర్శించి వారి ఆదేశాల మేరకు తాజాగా అక్కంపల్లి, పుట్టంగండి జలాశయాల అభివృద్ధికి రూ.25 కోట్లతో డ్యాం రిహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు(డ్రిప్) అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. ఆ నిధులు మంజూరు కాలేదు. జిల్లా సాగు, తాగు, జంటనగరాల తాగునీటి అవసరాలు తీర్చడంలో కీలక ప్రాత వహిస్తున్న ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అంచనాలు రూపొందించి పంపించాం– నాగయ్య, డీఈ, ఏఎమ్మార్పీ ఏఎమ్మార్ ప్రాజెక్టులో ప్రధానమైన అక్కంపల్లి, పుట్టంగండి జలాశయాల ఆధునికీకరణకు ఇటీవల రూ.25 కోట్లతో డ్రిప్ ఎస్టిమేట్ చేసి ప్రభుత్వానికి పంపించాం. కేంద్ర బృంద సూచన మేరకు ఈ అంచనాలు రూపొందించి పంపించాం. నిధులు మంజూరు కాగానే సిస్టర్న్ ఆనకట్టను వెడల్పు, రక్షణగోడ నిర్మాణం, బీటీ రహదారి, విద్యుద్దీకరణ పనులు చేపడతాం.

# దాతల సంకల్పం.. ఆధ్యాత్మికతకు పునరంకితం

మోత్కూరు : ఇటీవల గ్రామాల్లో దేవాలయాలు నిర్మించేం దుకు దాతలు ముందుకొస్తున్నారు. భక్తిభావాన్ని పెంచి, ఆధ్యాత్మిక చింతనతో ప్రజలు ప్రశాంత జీవనం గడిపేందుకు ఇవి దోహద పడుతున్నాయి. ఆలయాలు నిర్మించేందుకు కొందరు దాతలు రూ.కోట్లు వెచ్చిస్తుండగా, అనేక మంది తమ శక్తిమేరకు విరాళాలందించి తోడ్పడు తున్నారు. ఫలితంగా పల్లెల్లో నూతన దేవాలయాలు రూపుదిద్దుకొని ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందిస్తున్నాయి.

మోత్కూరు పట్టణం అంగడిబజారులోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో స్థానికులు దోర్నాల సత్తయ్య దంపతులు శ్రీసీతారామస్వామి చంద్రస్వామి ఆలయ నిర్మాణం కోసం స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి రూ.50 వేల చొప్పున వితరణ చేశారు. నాపరాళు,, ఇతర సామగ్రి కోసం పోచం శ్రీనివాస్, ప్రసాద్ రూ.3.20 లక్షలు, తీపిరిశెట్టి రాజవీరయ్య నిర్మాణ ఖర్చుల కోసం రూ.2.30 లక్షలు, బద్దం రామనర్సింహారెడ్డి విగ్రహాలకు రూ.1.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. పుట్ట రవికుమార్ ధ్వజస్తంభం నిర్మాణానికి రూ.1.10 లక్షలు, జొన్నల అనిల్‌కుమార్ రూ.1.16 లక్షలు, సోమ శ్రీశైలం కుమారులు రూ.50 వేలు, ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు కోసం దామెర సోమేశ్వర్ గుప్త, పల్లెర్ల వెంకన్న తోడ్పడ్డా రు. ఇలా చాలామంది దాతలు చేయిచేయి కలపడంతో ఆలయ నిర్మాణం పూర్తయ్యింది. ఈ సంవత్సరం మార్చిలో విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రారంభోత్సవం జరిగింది.

శ్రీనివాసుడి కోవెలకు శ్రీకారం

మోత్కూరు పురపాలిక పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎగమాటి రాంరెడ్డి– అరుణ దంపతులు ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చారు. మోత్కూరులోని వేంకటేశ్వరకాలనీలో పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఏడాది క్రితం సుమారు రూ.రెండు కోట్లు వెచ్చించి స్వచ్ఛం దంగా నిర్మించారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలను ఆహ్వానించగా అట్టహా సంగా విగ్రహాల ప్రతిష్ఠాపన, ఆలయాల ప్రారంభోత్సవం జరిగింది. ఇటీవల ఏడాది పూర్తి కావడంతో ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు కూడా ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయం నిర్వహణ కోసం శాశ్వతంగా నిధులుండేందుకు స్థానిక దాతలు ముందుకొచ్చి సుమారు రూ.కోటిన్నర దాకా విరాళాలిచ్చారు. ఈ డబ్బును బ్యాంకులో నిల్వచేసి, వాటి ద్వారా వచ్చే వడ్డీతో స్వామివారికి నిత్య పూజలు, ఉత్సవాలు జరిపించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు కృషి చేస్తున్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి గూడు

ఇదే పురపాలిక పరిధిలోని ధర్మాపురంలో పురాతన శ్రీప్రసన్నాంజయనేయస్వామి ఆలయం శిథిలావస్థకు చేరగా.. స్థానికుడు, విమానయానశాఖ విశ్రాంత ఉద్యోగి తాడూరు లక్ష్మారెడ్డి–పద్మజ దంపతులు పునర్నిర్మాణానికి ముందుకు వచ్చారు. సుమారు రూ.50 లక్షలను స్వచ్ఛందంగా విరాళమిచ్చి పాత ఆలయాన్ని తొలగించి, నూతనంగా నిర్మించారు. ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు విద్యుత్తుశాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు విగ్రహ ప్రతిష్ఠాపన చేసి, ప్రారంభించారు. ఇక్కడ నిత్యపూజలు జరుగుతుండటంతో స్థానిక భక్తులు స్వామివారిని దర్శనం చేసుకుంటున్నారు.

పురాతన ఆలయం పునర్నిర్మాణం

మోత్కూరు పురపాలిక పరిధిలోని బుజిలాపురంలో గల పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. ఆ ఆలయాన్ని కూలగొట్టి సుమారు రూ.1.50 కోట్లతో కోవెలను పునర్నిర్మించారు ఎగమాటి రాంరెడ్డి–అరుణ దంపతులు. అట్టహాసంగా ఏడాది క్రితం ప్రారంభం కాగా.. ఆలయ నిర్వహణకు భక్తులు విరాళాలందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంచాలని...–ఎగమాటి రాంరెడ్డి, అరుణ దంపతులు, బుజిలాపురం

ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందించాలనే ఇష్టదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మించాం. ఈ ప్రాంతానికి మంచిపేరు తేవాలని భావించాం. ప్రజలు, భక్తులు తోడ్పాటునంది జీవితకాలం వాటిని కాపాడుకోవాలి.

# నీ దర్శనం.. ఇదే నిదర్శనం

ఖమ్మం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో విజయ దశమి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఈఓ రమాదేవి నేతృత్వంలో సిబ్బంది విధులు నిర్వర్తించను న్నారు. 15 నుంచి 24 వరకు రోజుకో రూపంలో అమ్మవారు దర్శనమి వ్వనున్నారు. ఈ అలంకారాల వేళ భక్తులు తమ గోత్రనామాలతో పూజ చేయించుకునేందుకు వీలు కల్పించారు. దసరా రోజు పట్టాభిషేకం చేయించవచ్చు. ఉత్సవాల్లో రామాయణ పారాయణం కొనసాగనుంది. విజయదశమిని పురస్కరించుకుని 24న శ్రీరామ లీలామహోత్సవాన్ని నిర్వహించనున్నారు. దసరా మండపంలో కొనసాగే రావణ వధ ఘట్టం పరమానందం కలిగిస్తుంది. అదేరోజు శమీ పూజ సంప్రదాయబద్ధంగా కొనసాగనుంది. విజయదశమికి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయి.

15న ఆదిలక్ష్మి అలంకారం

లక్ష్మ అంటే గుర్తు అని అర్థం. భగవంతుడ్ని గుర్తించడానికి ప్రధాన లక్షణమైన అమ్మకు లక్ష్మి అని పేరు. వేద వేదాంతాల్లో కీర్తించబడిన భగవంతుని తత్వాన్ని లక్ష్మి అమ్మ ద్వారానే మనం గుర్తించగలగడంతో అమ్మకు లక్ష్మి అని పేరు సార్థకమైంది. అలా భగవంతుడ్ని గుర్తించడానికి ఆలంబనమైన లక్ష్మీతత్వాన్నే ఆదిలక్ష్మి అంటారు. ఈ రూపంలో అమ్మను చూసినవారు తరిస్తారు.

16న సంతానలక్ష్మి

సకల చరాచర జగత్తు అంతా ఆ అమ్మ సంతానమే. అందుకే ఈ అమ్మకు సంతానలక్ష్మి అని పేరు. ఈ రూపంలో అమ్మను ఆరాధిస్తే సుఖశాంతులు కలుగుతాయి. సంతానానికి సంబంధించిన అవరోధాలన్నీ తొలగి సత్సంతానం కలుగుతుందని విశ్వాసం.

17న గజలక్ష్మి



ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే అధికారం సిద్ధిస్తుంది. మహా సంపద కలుగుతుందని నమ్మకం. ఈ గజలక్ష్మిని ఆరాధించే దేవేంద్రుడు త్రైలోక్యాధిపత్యాన్ని సాధించినట్లు పురాణంలో ఉంది.

18న ధనలక్ష్మి

ధనం మూలం ఇదం జగత్. ధనం అంటే కేవలం డబ్బే కాదు. విద్య, బలం, కీర్తి వంటివన్నీ ధనమే. ధనం ముఖ్యంగా మూడు రకాలు. విద్యాధనం, హిరణ్య ధనం, శక్తి ధనం. ఈ మూడు విధాలయిన ధనాన్ని ప్రసాదించే అమ్మకు ధనలక్ష్మి అని పేరు.

19న ధాన్యలక్ష్మి

ధన ధాన్యకరీం సిద్ధిం అంటూ కీర్తిస్తుంది పురాణం. అన్ని రకాల ధాన్యాన్ని ప్రసాదించేది ఈ అమ్మే. ఈ అమ్మను ఆరాధిస్తే బాధలు తొలగుతాయని ప్రతీతి. సకాలంలో వానలు కురిసి దేశం సస్యశ్యామ లంగా ఉంటుంది.

20న విజయలక్ష్మి

జ్ఞానేశ్వరీ విజయప్రధా అని కీర్తిస్తారు. విజయం అంటే కేవలం యుద్ధ విజయం మాత్రమే కాదు. అన్ని రంగాల్లో విజయాన్ని ప్రసాదిస్తుంది. ఈ రూపంలో ఉన్న అమ్మను సేవిస్తే ఆయా రంగాల్లోని వారికి సునిశితమైన జ్ఞానాన్ని ప్రసాదించి తద్వారా వారిని విజయులను చేస్తుంది.

21న ఐశ్వర్యలక్ష్మి

ఐశ్వర్యం అంటే శాసనపరమైన శక్తి సామర్థ్యాలు అని అర్థం. అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకురాలు అమ్మ. కరుణారూపిణి అయిన ఈఅమ్మవారి క్రీగంటి చూపుల కదలికలనే శాసనాలుగా భావించి శ్రీ మహావిష్ణువు సకల జగద్రక్షణ చేస్తుంటాడని పండితుల భావన. ఈరూపంలో అమ్మను ఆరాధిస్తే శాసకత్వం, వాక్కుకు ప్రభావం, అనంత ఐశ్వర్యం కలుగుతాయని నమ్మకం.

22న వీరలక్ష్మి

ఈ అమ్మ మన దారిద్ర్యాన్ని, అన్ని రకాల ఉపద్రవాలను పారదోలే వీరత్వం గల అమ్మ. త్రిమూర్తులకు సైతం సాధ్యంకాని మహిషాసు రుని.. ముగ్గురమ్మల శక్తిస్వరూపమైన వీరలక్ష్మిగా ఆవిర్భవించి సంహరించింది.

23న శ్రీ మహాలక్ష్మి

మహాలక్ష్మి రూపంలో అమ్మను దర్శించుకుంటే సకల శుభాలు సిద్ధిస్తాయని పండితులు వివరిస్తున్నారు.

24న నిజరూప దర్శనం

ధనం, ధాన్యం, సంతానం, విద్య, అధికారం, వీరం, విజయం, ఐశ్వర్యం... ఇలా మనిషికి అవసరమైన అష్టైశ్వర్యాలను ప్రసాదించడా నికి అష్టలక్ష్మి రూపాలను ధరించిన అమ్మ కరుణాస్వరూపమైన తన నిజరూపంలో అందర్నీ అనుగ్రహిస్తుంది.

## ఇల్లెందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల

ఇల్లెందు: ఇల్లెందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల మంజూరు చేస్తూ జీవో విడుదలైంది. ప్రభుత్వ ఐటీఐ లేకపోవడంతో ఇల్లెందు నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల మండలాల విద్యార్థులు కొత్తగూడెం వెళ్లేవారు. ఇల్లెందులో సైతం ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు చేయాలని పాలకులు, విద్యార్థి సంఘాల నాయకులు పలుమార్లు విన్నపించారు. ఈమేరకు స్పందించిన ప్రభుత్వం లేబర్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీస్ శాఖ ద్వారా ప్రభుత్వ ఐటీఐ మంజూరు చేస్తూ జీఓ నంబర్ ఎంఎస్ 29 విడుదల చేసింది.

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఐఓటీ స్మార్ట్ అగ్రికల్చర్, ఫ్యాషన్ డిజైనర్ అండ్ టెక్నాలజీ, మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికల్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కోర్సులో 40 మంది విద్యార్థులకు ప్రవేశం ఉంటుంది. కళాశాల కోసం అధికారులు రూ.11.52కోట్లు విడుదల చేస్తూ పాలనాపరమైన ఆమోదానికి పంపించారు.

# ఇక రైట్ డైట్




ఖమ్మం : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థల (డైట్)ను బలోపేతం చేసేందుకు వాటిలో 'నిరంతర వృత్తిపర అభివృద్ధి'(సీపీడీ) విభాగాన్ని ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించి ంది. ఇందుకోసం ప్రతి డైట్, ప్రతి సబ్జెక్టుకు ఒక రిసోర్స్‌పర్సన్ చొప్పున, ప్రతి డైట్‌కు ప్రాథమిక స్థాయిలో ముగ్గురు ఎస్‌జీటీల చొప్పున సీపీడీ విభాగం ఏర్పాటుకు విషయ నిపుణులను గుర్తించాలని విద్యాశాఖ కార్యదర్శి వాకాటి అరుణ ఆదేశించారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ డైరెక్టర్ రాధారెడ్డి ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) శిక్షణలో పాలుపంచుకున్న ఎస్‌జీటీలు, ఉన్నతి, లక్ష్య పథకాల్లో పాల్గొన్న రాష్ట్ర/జిల్లా వనరుల సమూహాల (ఎస్ఆర్‌జీలు/ డీఆర్‌జీలు) నుంచి విషయ నిపుణులను సూచిస్తూ విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపించారు. వీటిని ఆమోదిస్తూ విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు.

రిసోర్స్‌పర్సన్ల విధులు నిరంతర వృత్తిపరమైన అభివృద్ధికి రిసోర్స్‌పర్సన్లు కృషి చేస్తారు. జిల్లా వార్షిక క్యాలెండర్ తయారీలో డైట్‌కు సహకరి స్తారు. జిల్లాలో నిర్వహించాల్సిన నిర్దిష్ట కార్యక్రమాలను గుర్తించడం, అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించి అమలుపరచటం, ఉపాధ్యాయుల అవసరాల ఆధారంగా శిక్షణ కార్యక్రమాలు, కార్యశాలలు, సెమినార్‌లు నిర్వహించడం, వయోజన విద్య, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన అభ్యసన సామగ్రిని తయారు చేయడం వంటివి రిసోర్స్ పర్సన్ల విధులు.

క్షేత్ర సందర్శన ప్రణాళిక...

నెలవారీ తాత్కాలిక క్షేత్ర సందర్శన ప్రణాళికను సిద్ధం చేయడం, వారానికి మూడు రోజులు క్రమం తప్పకుండా పాఠశాలలు, పాఠశాలల సముదాయాలను సందర్శించడం, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలును గమనించేందుకు రోజూ రెండు పాఠశాలలను సందర్శించడం, 'ఉన్నతి' కార్యక్రమ అమలును పరిశీలించేందుకు రోజూ రెండు ఉన్నత పాఠశాలలను సందర్శించడం, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావడం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అవసరమైన సాయం అందించడం వంటివి ప్రణాళికలో భాగం.

ఖమ్మం డైట్‌కు ఎంపికైన వారు... ఈ ఉత్తర్వుల ప్రకారం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి రాష్ట్రస్థాయిలో సేవలందిస్తున్న రిసోర్స్‌పర్సన్లు, జిల్లాస్థాయిలో పాల్గొనే రిసోర్స్ పర్సన్లను ఖమ్మం డైట్‌కు కేటాయించారు.

ఉన్నత పాఠశాలల శిక్షణ, పర్యవేక్షణ

పెసర ప్రభాకర్‌రెడ్డి, జీవశాస్త్ర విషయ నిపుణుడు, పాఠ్య పుస్తక రచయిత, ఎస్ఆర్‌పీ

ఎం.ఆదిత్యకుమార్, ఫిజికల్ సైన్స్ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్

వి.సునంద, తెలుగు రాష్ట్ర రిసోర్స్‌పర్సన్

ఎం.ప్రసాద్, గణితం, జిల్లా రిసోర్స్‌పర్సన్

జగదీశ్వరరావు, ఆంగ్లం జిల్లా రిసోర్స్‌పర్సన్

ఎం.డి.సలీం, హిందీ జిల్లా రిసోర్స్ పర్సన్

ప్రాథమిక స్థాయిలో..

ఎ.ప్రవీణ్‌కుమార్, ఎస్.అనిల్‌కుమార్,

ఎ.శ్రావణ్‌కుమార్

ఈ రిసోర్స్‌పర్సన్లు(ఎస్ఆర్‌జీలు/డీఆర్‌జీలు) ఖమ్మంలోని ప్రభుత్వ డైట్ కళాశాలకు వెళ్లటం వల్ల ఏర్పడిన ఖాళీలను ఇతర ఉపాధ్యాయుల డిప్యుటేషన్/పని సర్దుబాటు చేసి పూరించాలని, తద్వారా పాఠశాల విధుల అంతరాయాన్ని నివారించాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశించారు.

మౌలిక వసతులు మెరుగుపడే అవకాశం

నిర్దేశించిన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం అవసరమైన మౌలిక వసతులను కల్పించనుంది. శిక్షణ కోసం ప్రత్యేక భవనాలు, ఇతర అవసరాల కోసం నిధులు మంజూరు చేయటం ద్వారా డైట్‌లకు మహర్దశ పట్టనుంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో పాటు అదనపు సిబ్బంది జత కలిస్తే డైట్ కళాశాలలు కళకళలాడనున్నాయి.

# ఎన్నికలకు సమాయత్తం



ఖమ్మం : శాసనసభ ఎన్నికల హడావుడి మొదలుకాబోతో ంది. షెడ్యూల్ ఎప్పుడు విడుదలైనా ప్రక్రియను సాఫీగా నిర్వహించేం దుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతు న్నారు. ఓటరు నమోదు, ఓటు వినియోగంపై ఇప్పటికే ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మిగతా కార్యాచరణపై దృష్టి సారించారు.

భద్రాద్రి జిల్లాలో 231 సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఖమ్మం జిల్లాలో ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది.

నోడల్ అధికారుల నియామకం

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత ప్రవర్తన నియమావళి(కోడ్ ఆఫ్ కండక్ట్) సహా ఇతర అంశాలను పక్కాగా అమలుచేయాల్సి ఉ ంటుంది. ఈవీఎంల మేనేజ్‌మెంట్, శాంతిభద్రతలు, సిబ్బంది నియామకం- శిక్షణ, సామగ్రి నిర్వహణ, రవాణా, సైబర్ సెక్యూరిటీ, వ్యయ పరిశీలన, తపాలా బ్యాలెట్, కమ్యూనికేషన్ ప్రణాళిక, ఓటరు జాబితా, ఓటరు సహాయక కేంద్రం, పరిశీలకుల మేనేజ్‌మెంట్, సమన్వయం తదితరాలకు ఖమ్మం జిల్లాలో 24 మంది, భద్రాద్రి జిల్లాలో 16 మందిని నోడల్ అధికారులుగా కలెక్టర్లు నియమించారు. ఖమ్మం జిల్లాలో 1,455, భద్రాద్రిలో 1,095 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గానికో రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులను నియమించారు.

రౌడీషీటర్లు, పాత నేరస్థులపై ప్రత్యేక దృష్టి

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా రెండు జిల్లాల్లో పోలీసు శాఖలు సన్నద్ధమవుతున్నాయి. కోడ్ కూయకముందే శాఖాపరంగా ఎన్నికల క్రతువులో అనుసరించాల్సిన విధానాలపై కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే జిల్లా పోలీసు బాసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర సరిహద్దు జిల్లాలు కావడంతో ఎన్నికలు సజావుగా నిర్వహించేలా పోలీసు శాఖ ప్రత్యేకంగా నిఘా పెడుతోంది. సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసింది. నియోజక వర్గాల వారీగా కమిషనరేట్ పరిధిలో ఏసీపీలు, భద్రాద్రి జిల్లాలో డీఎస్పీలు ప్రత్యేకాధికారులుగా వ్యవహరించనున్నారు. భద్రాద్రి జిల్లాలో పదకొండు, ఖమ్మం జిల్లాలో 12 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచారు. గత ఎన్నికల్లో ఘర్షణలు జరిగినచోట్ల ఈసారి పునరావృతం కాకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులపై దృష్టి సారించారు.

జిల్లాలోని అయిదు నియోజకవర్గాలకు సంబంధించి 11,96,293 మంది ఓటర్లు ఉన్నారని, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది జాబితాను ప్రచురించినట్లు అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తెలిపారు. కలెక్టరేట్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు తుది జాబితా ప్రకారం నియోజకవర్గాల వారీగా ఖమ్మం 3,15,726 మంది, పాలేరు 2,32,606, మధిర 2,18,585, వైరా 1,90,755, సత్తుపల్లి 2,38,621 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈపీ(ఎలక్టోరల్ పాపులేషన్) నిష్పత్తి 693, లింగ నిష్పత్తి 1061, ఎన్ఆర్ఐ 146, సర్వీస్ ఓట్లు 682, పీడబ్ల్యూడీ 26,968 మంది, 80 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు 16,761, 18-19 ఏళ్ల వయసున్న వారు 44,204 మంది ఉన్నారని వెల్లడించారు. ఈ జాబితాను కలెక్టరేట్, రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్ కార్యాలయాలతో పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచినట్లు వివరించారు. అక్టోబరు 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండి, ఓటరు జాబితాలో పేరు లేకుంటే తక్షణమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ముగింపు నాటికి ఓటరుగా నమోదు కావాలని తెలిపారు. జిల్లాలో 822 ప్రాంతాల్లో 1,455 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటరు జాబితా పెన్‌డ్రైవ్‌లను అందజేశారు. సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెం డెంట్ రాంబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ, భాజపా, సీపీఎం, భారాస, తెదేపా, బీఎస్పీ ప్రతినిధులు పసునూరి శ్రీనివాస్, విద్యాసాగర్, పొన్నం వెంకటేశ్వరరావు, లింగనబోయిన సతీశ్, కె.కరుణాకర్, సీహెచ్.నాగేశ్వ రరావు, సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో ఏమరపాట్లు

ఖమ్మం : నేరం జరిగిన వెంటనే సైబర్ క్రైం అధికారులకు, బ్యాంకు అధికారులకు సమాచారం అందిస్తే నగదును హోల్డ్‌లో పెడుతున్నారు. తద్వారా మోసపోయిన వారికి నష్టం తగ్గుతోంది. తాజాగా కూసుమంచి మండలం నాయకన్‌గూడేనికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి టెలిగ్రామ్ ద్వారా సంక్షిప్త సందేశం వచ్చింది. అందులోని టాస్క్‌లను పూర్తి చేస్తే పెద్దమొత్తంలో నగదు పొందవచ్చని ఉండటంతో ఆ దిశగా లింక్‌లోని అంశాలను పూర్తి చేసి రూ.1.09లక్షలను డిపాజిట్ చేశాడు. అయినా తనకు నగదు రాకపోవడంతో పోలీసులను ఆశ్రయి ంచాడు.సత్తుపల్లి మండలం నారాయణపురానికి చెందిన చైతన్యకు రుణం అందిస్తామంటూ వాట్సాప్ ద్వారా లింక్ వచ్చింది. తొలుత రూ.4వేలు చెల్లిస్తే చాలు అని అవతలి వ్యక్తి సందేశం పంపాడు. దీంతో చైతన్య లింక్ ఓపెన్ చేసి రూ.4వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అప్పటి నుంచి అవతలి వ్యక్తి నుంచి స్పందన లేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పెనుబల్లి మండలం లింగగూడెం మండలం గట్టుగూడేనికి చెందిన అశోక్ రుణం కోసం ఓ యాప్‌ను క్లిక్ చేశాడు. సైబర్ నేరగాడు రుణం కోసం పలు దఫాలుగా అశోక్ నుంచి మొత్తం రూ.1.10లక్షలు కాజేశాడు. దీంతో బాధితుడు సైబర్ క్రైం కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్లు కొత్త వ్యూహాలతో బెంబేలెత్తిస్తున్నారు. అంతర్జాలం ద్వారా వివిధ యాప్‌లు, వెబ్‌సైట్‌లను ఉపయోగించే వారినే లక్ష్యం చేసుకుని బురిడీ కొట్టిస్తున్నారు. కంటికి కనిపించకుండా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లు, ఇంటర్‌నెట్ సహకారంతో కేటుగాళ్లు లక్షల రూపాయల




ను కొల్లగొడుతున్నారు. ఓ వైపు సాంకేతికత పెద్దఎత్తున పెరిగిపోతు ండగా మరోవైపు అంతకు మించిన ఆలోచనలతో సైబర్ నేరాలు నిత్యకృత్యమవుతున్నాయి. ఓ దశలో తమ ఫోన్‌లకు వచ్చిన సంక్షిప్త సందేశాలను ఓపెన్ చేయాలంటేనే నెటిజన్లు వణికిపోతున్నారు. సైబర్ నేరాలపై పోలీస్ యంత్రాంగం పెద్దఎత్తున వివిధ మార్గాల ద్వారా అవగాహన కల్పిస్తున్నా కొందరు అత్యాశతో నిలువునా మోసపోతున్నా రు. అమాయకులనే ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతు న్నారు. రుణం ఇస్తామని, లక్కీడ్రాలో రూ.లక్షలు గెలుచుకున్నారని, లాటరీలో రూ.కోట్లు సొంతం చేసుకుంటున్నారని, సెకండ్ హ్యాండ్ కార్లు, వాహనాలు, ఇతర వస్తువులను యాప్‌ల్లో పెట్టి ప్రజలకు వలవిసిరి ఇట్టే మోసం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ స్టేషన్‌లో చూసినా సైబర్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. సైబర్ క్రైమ్‌లను నివారించకుంటే మరిన్ని మోసాలు జరిగే ప్రమాదం ఉంది. సైబర్ మోసాల పట్ల యువత, విద్యావంతులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రాంత ప్రజలను పోలీసులు అప్రమత్తం చేస్తూ వారిని చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే ఇలా మోసాల పరంపర సాగుతూనే ఉంటుంది. గుర్తు తెలియని లింకులను క్లిక్ చేయవద్దు. బ్యాంకుల పేరుతో ఫోన్‌లు వస్తే ఎటువంటి సమాచారం ఇవ్వొద్దు. అనుమానమొస్తే బ్యాంకులను సంప్రదించాలి.
విష్ణు ఎస్.వారియర్, పోలీసు కమిషనర్, ఖమ్మం

## సర్కారు బడుల్లో అర్ధాకలికి చెక్

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా నిరుపేద విద్యార్థులు చదువుతున్నారు. పేదరికంతో చాలా మంది పరిగడుపున పాఠశాలలకు వెళుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల పరిగడుపు ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం 'సీఎం అల్పాహారం' పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఒక్కో రోజు ఒక్కో రకమైన ఆహారం వడ్డించనున్నారు. ఇప్పటికే సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, రాగి జావ అందిస్తుండగా తాజాగా అల్పాహారంతో విద్యార్థులకు ఆకలి వెతలు తీరనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రయోగాత్మకంగా నియోజక వర్గానికి ఒక పాఠశాలలో ప్రారంభించేందుకు విద్యాశాఖ సిద్ధం చేసింది. దసరా సెలవుల తర్వాత అన్ని పాఠశాలల్లో అమలు చేస్తారు.

ఖాళీ కడుపుతో పాఠశాలకు...

ప్రభుత్వ పాఠశాలల్లో పేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుతుండటంతో తరగతులకు దుమ్మా కొడుతున్నారు. స్థానికంగా పాఠశాలలు అందుబాటులో లేక దూర ప్రాంతాల విద్యార్థులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో పాఠశాలలకు చేరుకుంటున్నారు. ఉదయం పూట ఖాళీ కడుపుతోనే వెళ్లడంతో నీరసంగా ఉంటూ అస్వస్థతకు గురవుతున్నారు. జిల్లాలో 359 ప్రాథమిక పాఠశాలల్లో 12,542 విద్యార్థులు, 83 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 5,464, 101 ఉన్నత పాఠశాలల్లో 12,195 మంది చదువుతున్నారు.

బలవర్ధకమైన ఆహారం...సర్కారు బడుల్లో కొన్నేళ్లుగా సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. ఈ ఏడాది నుంచి రాగి జావ కూడా అందిస్తుండటంతో ఆకలి సమస్య తీరినట్లయింది. తాజాగా రుచి, బలవర్ధకమైన అల్పా హారం అందిస్తుండంతో విద్యార్థులకు బహుళ ప్రయోజనం కలగనుంది. పేద విద్యార్థులకు వరం మా పాఠశాలలో చాలా మంది పేద విద్యార్థులమే. ఉదయం పూట ఖాళీ కడుపుతోనే వస్తున్నా. మధ్యాహ్న భోజనంతో కొంత ఆకలి తీరుతుంది. ప్రభుత్వం రుచికరమైన అల్పాహారం అందిస్తుండటంతో పేద విద్యార్థులకు నిజంగా ఒక వరమే. హర్షిత, 5వ తరగతి, రామగుండం ప్రాథమిక పాఠశాలపాఠాలపై ఏకాగ్రతఉదయం వేళలో పిల్లలకు ప్రభుత్వం అందించే అల్పాహారంతో ప్రయోజనం కలగనుంది. బలవర్ధకమైన ఆహారం తీసుకోవడంతో పాఠాలపై ఏకాగ్రత పెరుగుతుంది. సుప్రజ, 5వ తరగతి, అమర్‌నగర్ ప్రాథమిక పాఠశాల పెద్దపల్లిఇదీ మెనూ..సోమవారం : ఇడ్లీ, సాంబారు / గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ మంగళవారం : పూరీ, ఆలు కుర్మా/ టోమాటో బాత్, సాంబారుబుధవారం : ఉప్మా, సాంబారు / బియ్యం రవ్వ కిచిడి చట్నీ గురువారం : చిరుధాన్యాల ఇడ్లీ సాంబారు / పొంగల్ సాంబారు శుక్రవారం : అటుకులు, చిరుధాన్యాల ఇడ్లీ చట్నీ / బియ్యం రవ్వ కిచిడి చట్నీశనివారం : పొంగల్, సాంబారు/ కూరగాయల పలావ్, పెరుగు చట్నీ, ఆలుకుర్మా

# యాసంగి సాగు ప్రణాళిక ఖరారు

వరంగల్ : జిల్లాలో యాసంగి సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయశాఖ రూపొందించింది. సాగుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు ఎంత మేరకు అవసరమవుతాయనే దానిపై అధికారులు ప్రతిపాదనల్ని సిద్ధం చేసి రాష్ట్ర వ్యవసాయశాఖకు పంపించారు. ప్రతిపాదనలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ సారి జిల్లాలో నీటి వనరులు సమృద్ధిగా ఉండగా.. శ్రీరాంసాగర్, దేవాదుల ప్రాజెక్టుల నుంచి సైతం నీటి సరఫరా జరుగుతోంది. నీటి సౌలభ్యం మేరకు పంటల సాగు ప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. జిల్లా సాధారణ సగటు సాగు విస్తీర్ణం 1,69,376 ఎకరాలు కాగా ఈ యాసంగిలో



1,84,140 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని ప్రతిపాదించారు. గతేడాది యాసంగిలో 1,50,470 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. పెరిగే అవకాశం..: రవీంద్రసింగ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, హనుమకొండ

యాసంగి సాగుకు సరిపడా నీరుంది. ఆరుతడి పంటలుగా పొద్దుతిరుగుడు, జొన్న, శనగ, పప్పుధాన్యాలతోపాటు వేరుశనగ సాగు చేయవచ్చు. వరి, మొక్కజొన్న సాగు పెరిగే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల కొరత ఏర్పడకుండా కార్యాచరణ రూపొందించాం. త్వరలో విత్తనాలు అందుబాటులో ఉంచుతాం.

# మిగులు స్థలాలు మాయం..!

మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలో పురపాలక సంఘానికి చెందిన మిగులు భూములు (గ్రీన్‌ల్యాండ్స్) మాయమవుతున్నాయి. అన్యాక్రాంతమవుతున్న గ్రీన్‌లాండ్స్‌ను పూర్తి స్థాయిలో కాపాడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలో సుమారు 150కిపైగా మిగులు స్థలాలు ఉండగా ప్రస్తుతం వంద స్థలాలు కూడా కనిపించడం లేదు. గ్రీన్‌లాండ్స్ లెక్కలు అధికారులు కచ్చితంగా తేల్చలేకపోతున్నారు. దీంతో సుమారు రూ.కోట్ల విలువైన మిగులు స్థలాలు కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక జాబితాలో 57, మరొకదానిలో 54, ఇంకో జాబితాలో 145 గ్రీన్‌లాండ్స్ ఉన్నట్లు అధికారులు వేర్వేరుగా ప్రకటిస్తున్నారు. వీటిలో కొన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా సామూహిక భవనాలు నిర్మించగా మరికొన్ని స్థలాల్లో పార్కులు, ఓపెన్ జిమ్‌లు, పట్టణ పకృతి వనాలను నెలకొల్పారు. కొన్ని విలువైన స్థలాలను ప్రైవేటు వ్యకులు ఆక్రమించినట్లు కొందరు వార్డు కౌన్సిలర్లే అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల గ్రీన్‌లాండ్‌ల ఆక్రమణపై కన్నేసిన వ్యక్తులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా అడ్డుకుంటున్నారు. ఈ అంశంపై అధికారులు మౌనం పాటించడంపై అనుమానాలకు తావిస్తోంది.

అభివృద్ధి పనుల అడ్డగింత

పాతబజార్‌లో మన్మోహన్‌రెడ్డి కాంప్లెక్స్‌లో 2004లో లే-అవుట్ చేసి వేయి గజాల స్థలం గ్రీన్‌లాండ్‌గా గుర్తించారు. ఈ స్థలాన్ని



ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు ఆ స్థలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా అడ్డుకుంటున్నారు. పాత బజార్‌లో కూరగాయల మార్కెట్ సౌకర్యం లేనందున గత పాలక మండలి ఆ మిగులు స్థలంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు రూ. 16 లక్షలు కేటాయించింది. ఆ సమయంలో అక్కడ పనులు జరుగకుండా వివిధ కారణాలు చెబుతూ అడ్డుకున్నారు. మార్కెట్ కాకున్నా మినీ పార్కు, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేసేందుకు కూడా వారు సహకరించడం లేదు. వారికున్న రాజకీయ పలుకుబడితో ఆ స్థలాన్ని ఖాళీగా ఉంచి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు.

మొక్కలు నాటినా తొలగించి..

ఈ చిత్రంలో కనిపిస్తున్న మిగులు స్థలంలో పురపాలక అధికారులు పట్టణ ప్రకృతి వనం పేరిట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సమీపంలోని 11 వందల గజాల మిగులు స్థలంలో పురపాలక అధికారులు మొక్కలు నాటారు. స్థిరాస్తి వ్యాపారులు ఆ స్థలంలో ఉన్న మొక్కలను తొలగించి చదును చేశారు. మళ్లీ మొక్కలు నాటుతామని చెప్పి ఏడాది కావొస్తున్నా ఒక్క మొక్క కూడా నాటలేదు. ఈ ప్రాంతంలో గజానికి సుమారు రూ. 20 వేలు ధర పలుకుతోంది.

చదును చేశారు

మహబూబాబాద్ పట్టణంలోని హస్తినాపురం కాలనీలో ఎక్కువగా మిగులు స్థలాలు ఉన్నాయి. రైల్వే ట్రాక్ పక్కన రెండెకరాలకు పైగా గ్రీన్‌లాండ్ అప్పగించారు. ఈ స్థలంలో గతంలో రెండు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు నిర్మించారు. మిగిలిన స్థలంలో పురపాలక సంఘం కార్యాలయం నిర్మించేందుకు ప్రయత్నించగా సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. అధికారులు రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో రాజకీయంగా పలుకుబడిన కలిగిన కొందరు వ్యక్తులు ఆ స్థలంపై కన్నేసి ఆక్రమించేందుకు చదును చేసేందుకు పెద్ద రాళ్లను తొలగించారు.

స్థలాల రక్షణకు కదలాలి..పురపాలక సంఘం ఇటీవల నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు గ్రీన్‌లాండ్స్ అంశాన్ని ప్రధానంగా ముందుకు తెచ్చారు. ఈ అంశం ఏకైక ఎజెండాగా సమావేశం నిర్వహిస్తామని చెప్పి ఈ విషయాన్నే మరచిపోయారు.

గుర్తించి తగిన చర్యలు తీసుకుంటాం- కె.ప్రసన్నరాణి, పురపాలక కమిషనర్

పట్టణంలో ఉన్న మిగులు స్థలాలు (గ్రీన్‌లాండ్స్) గుర్తించి వాటి రక్షణకు చర్యలు తీసుకుంటాం. ఆక్రమణకు గురైతే ఆ స్థలాలను స్వాధీనం చేసుకుంటాం. కొందరికీ ఇప్పటికే నోటీసులు పంపించాం. ఈ స్థలాల విషయమై ప్రత్యేక కార్యాచరణ చేపడుతాం.

# రవాణా భత్యం.. నమోదుకు దూరం



వరంగల్ : దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వాహనాల్లో వచ్చేందుకు ప్రభుత్వం రవాణా భత్యం అందిస్తోంది. ఆటోలు, సైకిళ్లు, కాలినడకన బడికొస్తుంటే ప్రోత్సాహం కింద భత్యం ఇస్తున్నారు. అందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలి. కార్యాచరణ సక్రమంగా లేక దరఖాస్తుల సంఖ్య 70 శాతానికి మించటం లేదు.

ఆగస్టు నుంచే అవకాశం..

అర్హులైన విద్యార్థుల జాబితాను ఆయా పాఠశాలలకు పంపిస్తూ ఆగస్టు నుంచి దరఖాస్తులకు అవకాశాలు కల్పించారు. జిల్లాలో 574 మందిని అర్హులుగా గుర్తించగా ఇప్పటివరకు 327 మంది మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు స్థానికంగా బడి అందుబాటులో లేక పొరుగున ఉండే మరో ఊరికి వెళ్తే నిబంధనల ప్రకారం రవాణా భత్యం చెల్లించాలి. కరోనా కారణంగా మూడేళ్లుగా విద్యార్థులకు రవాణా భత్యం దూరమైంది. 2022-23 విద్యాసంవత్సరంలో జూన్‌లో పాఠశాలలు ప్రారంభం కావటంతో ఎప్పటి మాదిరిగానే భత్యం అందించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. ప్రాథమిక పాఠశాల ఒక కిలోమీటరు, ప్రాథమికోన్నత మూడు కిలోమీటర్లు, ఉన్నత పాఠశాల అయిదు కిలోమీటర్ల దూరంలో ఉంటే రవాణా భత్యం చెల్లిస్తారు. నిర్ణీత దూరంలో పాఠశాల నుంచి బస్సు సౌకర్యం కలిగిన గ్రామాల విద్యార్థులకు చెల్లించరు.

నెలకు రూ.600..జిల్లాలోని 11 మండలాల్లో 319 ప్రాథమిక, 44 ప్రాథమికోన్నత, 69 ఉన్నత పాఠశాలలున్నాయి. విద్యాశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు జిల్లాలో సర్వే నిర్వహించి అర్హులను గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు దూరంగా ఉన్న వివిధ గ్రామాలకు చెందిన 746 మంది విద్యార్థులతో ప్రతిపాదనలు పంపించారు. అందుకు ప్రభుత్వం 574 మందిని అర్హులుగా గుర్తించింది. ఆవాస ప్రాంతం నుంచి ప్రభుత్వం నిర్దేశించిన దూరంలోని ప్రభుత్వ బడికి సైకిల్, ఆటో, ఇతర వాహనాలపై వెళున్న ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున 10 నెలలు రవాణా భత్యం చెల్లిస్తారు. ఆగస్టులో వజ్రోత్సవాల వేడుకలు, తర్వాత తొలిమెట్టు అమలుతో ఆన్‌లైన్ నమోదు నెమ్మదిగా కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.సద్వినియోగం చేసుకోవాలి- రాజేందర్, డీఈవో, భూపాలపల్లి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన విద్యార్థులు బ్యాంకు ఖాతాలను పాఠశాల ప్రధానోపాధ్యాయు లకు అందిస్తే సకాలంలో దరఖాస్తు చేయటానికి వీలుంటుంది.

# ఉపాధి బాటలో వనితలు



భూపాలపల్లి : మహిళలు.. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.. ఇంటిని చక్కదిద్దడమే కాదు.. కుటుంబ పోషణకు కావాల్సిన ఆర్థిక సహకారం అందిస్తున్నారు. విద్య, వైద్యం, వ్యాపారం, పారిశ్రామిక తదితర రంగాల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వెళ్తూ చెమటోడుస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ పథకంలో మహిళలు పురుషులతో సమానంగా తమ పేరును నమోదు చేసుకున్నారు. 2022-23 సంవత్సరంలో పని దినాలను వినియోగించుకోవడంలో ముందంజలో ఉన్నారు. ఉపాధిహామీ పథకం ప్రారంభించిన కొత్తలో పురుషులే పనులకు వెళ్లేవారు. క్రమక్రమంగా మహిళలు ఉపాధి బాట పట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిశీలించినట్లైతే 67,43,986 పని దినాలను పురుషులు వినియోగించుకోగా, 95,07,050 పని దినాల్లో వనితలు పాలుపంచుకున్నారు. అంటే 27,63,064 పని దినాలను మహిళలే ఎక్కువగా వినియోగించుకున్నారు. 3027 కుటుంబాలు వందరోజుల పని దినాలు పూర్తి చేసుకున్నాయి. ఈ కుటుంబాల్లో డిగ్రీ, ఆపై చదువుకున్న యువతీయువకులు ఉంటే వారికి గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉన్నతి అనే పథకం ద్వారా నైపుణ్య శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.నర్సింహులపేట: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో 3,544 స్త్రీలకు, 3,018 పురుషులకు జాబ్‌కార్డులు ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 1,78,583 పనిదినాలు మహిళలు, 1,52,126 పనిదినాలు పురుషులు పూర్తి చేశారు. మహిళలు వచ్చిన వేతనంతో పిల్లలు పాఠశాలల ఫీజు కడుతున్నారు. మరికొందరు గేదెలు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేసి ఆర్థికంగా ఎదుగుతున్నారు.

భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామంలో మహిళా కూలీలు పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రామంలో 2087 మొత్తం కూలీలు ఉండగా 1120 మంది మహిళలు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 13 వేల పని దినాలు చేశారు.భూపాలపల్లి మండలం గూడాడ్‌పల్లిలో 600 మంది.. ఉండగా అందులో 322 మంది మహిళలే. ఈ ఏడాది 8 వేల పనిదినాలను పూర్తి చేసుకుని కుటుంబాలకు అండగా ఉంటున్నారు.

3.64 లక్షల మంది

హనుమకొండ, వరంగల్, జయశంకర్, ములుగు, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో 7,93,958 జాబ్‌కార్డులు ఉన్నాయి. 17,66,361 మంది కూలీలుగా నమోదయ్యారు. అందులో 3,64,061 మంది మహిళలు ఉండటం విశేషం. పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ కుటుంబ పోషణలో తమ వంతు సహకారం అందిస్తున్నారు. తమ కాళ్లపై తాము నిలబడటం ఎంతో సంతృప్తిని ఇస్తోందని పలువురు మహిళా కూలీలు చెబుతున్నారు.

చేసే పనులు

చెరువులు, కాల్వల పూడికతీత, హరితహారంలో నాటిన మొక్కలకు నీరు పెట్టడం, నర్సరీలో విత్తనాలు పెట్టడం, నర్సరీలో కలుపు తీయడం, అడవిలో కందకాలు తీయడం, అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలకు రక్షణగా ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం తదితర పనులకు వెళ్తున్నారు. వందరోజులు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికి సుమారుగా 25 వేల వరకు ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

మేట్లుగా కొనసాగుతూ..

మహిళలు మేట్లుగా కూడా పనిచేస్తున్నారు. 20 మంది కూలీలు ఉన్న బృందంలో చదవడం, రాయడం వచ్చిన మహిళలను మేట్లుగా ఎంపిక చేస్తున్నారు. వారు మస్టర్లు తీసుకోవడం, కూలీలకు పని ప్రదేశం చూపించడం, కొలత ప్రకారం పని చేయించడం, సంతకాలు తీసుకుని సంబంధిత అధికారులకు అందించడం, కూలీల డబ్బులకు సంబంధించిన రసీదులను అందించడం తదితర పనులను విజయవంతంగా చేస్తున్నారు.

ఆసక్తి చూపుతున్నారుపురుషోత్తం, డీఆర్డీవో, జయశంకర్

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఉపాధిహామీ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. పనులు చేయడానికి పురుషుల కంటే మహిళలే ఆసక్తి చూపిస్తున్నారు. ఈ 2022-23 ఆర్థిక సంవత్సరంలో వారి సంఖ్యే ఎక్కువగా ఉంది. గ్రామశక్తి సంఘాలను ప్రోత్సహించి మహిళలకు తేలికపాటి పనులు అప్పగించేలా చర్యలు తీసుకుంటాం.

# వాహనాలు తుక్కు.. చెత్త రవాణాకు అవే దిక్కు!

వరంగల్ : ఇనుప తుక్కుకు తరలించాల్సిన వాహనాలను నేటికీ వినియోగిస్తూ నర్సంపేట పురపాలక సంఘం తన ఘనతను చాటుతోంది. రంధ్రాలు పడిన అడుగు భాగాలు, కరవైన తలుపులు..ఊడిపోయిన రేకులతో కూడిన ట్రాక్టర్లతో చెత్త సేకరణకు తిప్పలు తప్పడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించి మొత్తం ఆరు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. వీటి నిర్వహణపై నిర్లక్ష్యం వహించారు. చిన్న మరమ్మతులను కూడా బాగు చేయకుండా నడపడంతో అన్ని భాగాలు దెబ్బతిని ఊడిపోతున్నాయి. వాటిని బాగు చేయాలనే ధ్యాసే అధికారులకు కొరవడింది. డబ్బాల తయారీలో నాణ్యతలేని సామగ్రి వాడకమే అనతి కాలంలోనే పాడవ్వడానికి కారణమంటున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ వెంకటస్వామిని వివరణ కోరగా డబ్బాలు దెబ్బతిన్న మాట వాస్తవమేనన్నారు. తాను వచ్చినప్పటి నుంచి దశల వారీగా మరమ్మతులు చేయించానని, త్వరలో బాగు చేయిస్తానన్నారు.

# రెచ్చిపోతున్న భూమాఫియా

వరంగల్ : వరంగల్ నగరంలో ప్రైవేటు ప్లాట్ల పంచాయితీ పెరిగాయి. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల అనుచరులు విలువైన స్థలాలపై కన్నేశారు. 15-20 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లపై కొత్త కిరికిరీలు పెడుతున్నారు. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల కోసం మధ్య తరగతి, ప్రభుత్వ ఉద్యోగులు కొనుగోలు చేసిన ప్లాట్లను సొంతం చేసుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అసలు యజమానులకు తెలియకుండానే స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. పలుకుబడిని ఉపయోగించి రాత్రికి రాత్రి ప్రహరీలు కట్టడం, వారం తిరగక ముందే బల్దియా నుంచి ఇంటి నంబర్లు పొందుతున్నారు. ఇదెక్కడి అన్యాయమని అడిగితే ప్లాటు అమ్మాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. కొంతకాలంగా స్తబ్దతగా ఉన్న భూమాఫియా మళ్లీ రెచ్చి పోతోంది. మూడు, నాలుగు నెలలుగా బల్దియా ప్రజావాణి, వరంగల్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదులు



వెల్లువెత్తాయి. సుబేదారి, హనుమకొండ, వరంగల్ మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్లు, బల్దియా కార్యాలయం చుట్టూ బాధితులు తిరుగుతున్నారు. సెటిల్‌మెంట్ల వెనుక ముఖ్యమైన నాయకులు ఉండటంతో ప్రభుత్వ శాఖాధికారులు ఏం చేయలేక పోతున్నారనే విమర్శలున్నాయి.

ఇవిగో ఉదాహరణలు

హంటర్ రోడ్ ఆర్వోబీ కూడలిలో ఓ బిల్డర్ అపార్ట్‌మెంటు కట్టాడు. పక్కనే ఉన్న ఖాళీ ప్లాట్లపై కన్నేశాడు. రెండు, మూడు స్థలాలు సొంతం చేసుకునేందుకు భూమాఫియాను రంగంలోకి దింపాడు. హనుమకొండలో ఓ సేవా ఆశ్రమం నిర్వాహకులకు చెందిన సుమారు 800 గజాల స్థలాన్ని తక్కువ ధరకు అమ్మాలని తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నాడు. పలుకుబడి ఉపయోగించి ఏడెనిమిదేళ్ల క్రితం నిర్మించిన గోడలను నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బందితో కూల్చివేయించారు. బాధితులు బల్దియా కమిషనర్, పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేశారు.

హనుమకొండ వడ్డేపల్లిలో 320 గజాల ప్లాటుపై రెండు వర్గాల మధ్య వివాదముంది. దీన్ని సెటిల్ చేసేందుకు ఓ మాజీ కార్పొరేటర్ రంగంలోకి దిగాడు. ఇద్దరికి ఇంతో, అంతో ఇచ్చేసి స్థలాన్ని సొంతం చేసుకునే పనిలో ఉన్నాడు.

హంటర్‌రోడ్ బొందివాగు నాలా పరిసరాల్లో రెండు గుంటల భూమి వివాదాస్పదమైంది. ఓ రాజకీయ పార్టీ నాయకుడు, బిల్డర్ మధ్య పేచీ ఏర్పడింది. భూ సెటిల్‌మెంట్ల ముఠా రంగంలోకి దిగి సర్దుబాటు చేసింది. ఇదే స్థలంపై మూడో వ్యక్తి రంగంలోకి దిగాడు.

రంగశాయిపేట నాయుడు పంపు కూడలి ఆర్టీవో కార్యాలయం సమీపంలో 450 గజాల స్థలంపై రెండు వర్గాలు న్యాయస్థానానికెళ్లాయి. ఇద్దరిని సముదాయించి విలువైన స్థలాన్ని సొంతం చేసుకునేందుకు ఓముఠా చర్చలు జరుపుతోంది.

# ప్రతి బడికో విశిష్ట సంఖ్య

జనగామ : పాఠశాల విద్యకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని కేంద్రం తెప్పించుకోవాలనుకుంటుంది. ఇందులో పొందుపరిచే సమాచారం నూరుశాతం వాస్తవానికి దగ్గరగా ఉండేలా గత విధానాలకు మెరుగులు దిద్దనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల విద్యాశాఖ గణాంకాధికారుల సమావేశంలో యూడైస్‌లో జరగనున్న మార్పులపై కేంద్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు. పాఠశాలల నిర్వహణకు సంబంధించి అంశాలవారీగా సమాచారాన్ని అందించే విషయంలో పలు మార్పులకు కేంద్రం బాటలు వేసిందని చెప్పారు.

యూడైస్‌లో మార్పులు ఇప్పటి వరకు రాష్ట్రం, జిల్లా, మండలం, ఆవాసాల వారీగా యూడైస్ ప్రత్యేక సంఖ్యలు కేటాయించే వారు. ఇక నుంచి ఈ గుర్తింపు సంఖ్యను మార్చనున్నారు ఆధార్ సంఖ్య తరహాలో ప్రతి పాఠశాలకు విశిష్ఠ గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నారు. ఒక ఇంట్లోని కుటుంబ సభ్యులు ఒకేసారి ఆధార్‌కార్డులు తీసుకున్నా నంబర్లు వరుసగా ఉండనట్టే.. ఒక గ్రామంలోని పాఠశాల యూ డైస్ గుర్తింపు సంఖ్యలు వరుసగా ఉండవని తెలిసింది. దీంతో సంఖ్య ఆధారంగా పాఠశాలను గుర్తించలేమని చెప్పారు. సాధారణంగా డైస్ సమర్పణ ప్రధానంగా విద్యాసంస్థల్లో చేరిన విద్యార్థుల సంఖ్య నిర్ధారణకు ప్రతి ఏటా సెప్టెంబర్ 30ని డైస్ డేగా పరిగణిస్తామని, దీంతో ఆరోజు ఉన్న మిగతా వివరాలను నమోదు చేసి తర్వాత జరిగిన మార్పులను నమోదు చేయడం వీలయ్యేది కాదు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, వృత్తిపరమైన విద్యార్హతలు, పాఠశాల గదులకు మరమ్మతులు, కొత్త గదుల నిర్మాణం తదితర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసే అవకాశం కల్పించనుంది. ప్రతి విద్యార్థి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసే అవకాశం కలగనుంది.

మరింత పారదర్శకంగా..

కేంద్రం సహా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సేకరించిన వివరాలను అందుబాటులో ఉంచాక ప్రతి పౌరుడూ గమనించేలా అందుబాటులో, మరింత పారదర్శకంగా ఉంచేందుకు సన్నాహాలు చేస్తోంది. మధ్యాహ్నభోజనం సహా ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, పాఠశాలలు దూరంగా ఉంటే రవాణా భత్యం అందిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యలో మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు వీలుగా స్వయం మదింపునకు అవకాశం కల్పించి మరింత కచ్చితమైన సమాచారాన్ని పొందుపర్చనున్నట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తాం..- పెనుగొండ రమేశ్, సెక్టోరియల్ అధికారి, జిల్లా విద్యాశాఖఇటీవల విజయవాడలో జరిగిన దక్షణాది రాష్ట్రాల విద్యాశాఖ అధికారుల సమావేశానికి హాజరై అధికారులు చెప్పిన వివరాలు నమోదు చేసుకున్నాను. యూ డైస్ సమర్పణలో ఉపాధ్యాయుల వివరాలు, పాఠశాల మౌలిక వసతుల ఉనికిలో మార్పులను ఎప్పటికప్పుడు మదింపు చేసుకునే అవకాశాలు సహా వీటి నమోదులో అనుసరించాల్సిన మార్పులపై అవగాహన కల్పించారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాక మరింత స్పష్టత వస్తుందని ఉన్నతాధికారులు చెప్పారు. ప్రతి అంశం కేంద్రం నుంచి సాధారణ పౌరుడి వరకు అందరికీ అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు.

# వైఎస్సార్ జిల్లాలో రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి



ఎర్రగుంట్ల: వైఎస్సార్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు మృత్యువాతపడ్డారు. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి సమీపంలో ఆర్టీసీ బస్సు - ఆటో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, ఎర్రగుంట్ల తహసీల్దార్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రొద్దుటూరు, కడపకు చెందిన 11 మంది.. ప్రొద్దుటూరు నుంచి మల్లెలకు ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆటో లారీని క్రాస్ చేయబోతుండగా.. ఎర్రగుంట్ల నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళా డ్రైవర్‌తో సహా ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మృతి చెందారు. మృతులను మహమ్మద్ (25), హసీనా (25), అమీనా(20), షాకీర్(10)లుగా గుర్తించారు.

# చంద్రబాబును అరెస్టు చేసి జగన్ చాలా పెద్ద తప్పు చేశారు: మజ్జి పద్మావతి



ఏలూరు : టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో తెలుగు మహిళా కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. అందులో భాగంగా మోకాళ్ళపై చిన వెంకన్న మెట్లు ఎక్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి పద్మావతి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని స్కిల్ డెవలప్మెంట్ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైల్లో పెట్టడం చాలా దారుణమన్నారు. ఎన్నడు ఇంట్లోంచి రాని మహిళలు సైతం చంద్రబాబుకు మద్దతుగా వస్తున్నారని, చంద్రబాబును అరెస్టు చేసి సీఎం జగన్ చాలా పెద్ద తప్పు చేశారన్నారు. ఒకరోజు విశ్రాంతి ఇస్తేనే వ్యూహాలు రచించే చంద్రబాబు, 30 రోజులు విశ్రాంతి ఇవ్వడంతో కచ్చితంగా వ్యూహాలు రచించి 175 కి 175 సీట్లు సాధిస్తారనీ, అలాగే వైసీపీ ప్రభుత్వాన్ని అధపాతాళానికి తొక్కుతారన్నారు. ఎన్‌టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పుడు ఎంతటి ప్రభంజనం వచ్చిందో మళ్లీ అదే ప్రభంజనం వచ్చి చంద్రబాబుడు ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఇది ప్రజలకు వైసీపీ ప్రభుత్వానికి జరుగుతున్న యుద్ధమని, తప్పకుండా ప్రజలు గెలిచి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తారని మజ్జి పద్మావతి అన్నారు.

# పేదల ద్రోహి జగన్‌కు.. ఐదు కోట్ల జనానికి మధ్య యుద్ధం




అమరావతి: పేదల ద్రోహి జగన్‌కు ఐదు కోట్ల జనానికి మధ్య జరుగుతున్న యుద్ధమని, తన అవలక్షణాలు ఎదుటివారికి అంటగట్టి చెప్పిన అబద్దమే వందసార్లు చెప్పడం జగన్ రెడ్డి నైజమని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ... నాలుగున్నరేళ్లుగా జగన్ రెడ్డి కంటికి వైసీపీ ప్రజాప్రతినిధులు కనిపించలేదని, తాడేపల్లి ప్యాలెస్‌లోకి వారికి అనుమతి లేదని, పంచాయతీ నిధులు మళ్లింపును ప్రశ్నించిన వైసీపీ సర్పంచులపై లాఠీ ఛార్జ్ చేయించారని విమర్శించారు. పేదలపై జగన్ రెడ్డి పేదల పేరుతో కొంగ జపం చేస్తూ కపట ప్రేమ చూపుతున్నారని, పేదలపై ప్రేమ నిజమైతే పేదల కోసం చంద్రన్న పెట్టిన 120 పథకాలు ఎందుకు రద్దు చేశారని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీల సబ్ ప్లాన్ నిధులు రూ. 1.14 లక్షల కోట్లను ఎందుకు మళ్లించారన్నారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కోత కోసి 16,800 రాజ్యాంగబద్ధ పదవుల దూరం ఉద్ధరించడమా?.. విదేశీ విద్య, స్టడీ సర్కిల్స్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రద్దు పేదలపై ప్రేమతో చేశారా? అని నిలదీశారు. లక్ష బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా బడుగు బలహీన వర్గాలకు దగా చేసింది నిజం కాదా?... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పారిశ్రామిక రాయితీలు దూరం వాస్తవం కాదా?.. సలహాదారులు, వైస్ ఛాన్సులర్లు, టీటీడీ, ఏపీఐఐసీ లాంటి ఉన్నత పదవుల్లో బడుగులు ఎక్కడని ప్రశ్నించారు. నాసి రకమైన మద్యంతో 20 వేల మంది పేదల ప్రాణాలు తీశారని, ఉచిత ఇసుక రద్దు చేసి 125 కుల వృత్తులు వ్యాపారాలను దెబ్బతీశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. అన్న క్యాంటీన్లను రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదల కడుపుకొట్టారన్నారు. పెళ్లి కానుకలు, సంక్రాంతి రంజాన్ క్రిస్మస్ కానుకలు రద్దు చేశారని, నిరుద్యోగ భృతి రద్దు చేసి పేద యువతకు నమ్మక ద్రోహం చేశారని మండిపడ్డారు. 2018-19లో సంక్షేమానికి టీడీపీ 18.21శాతం ఖర్చు చేస్తే 2022-23లో జగన్ ఖర్చు 16.20 శాతం మాత్రమేనని, జగన్‌రెడ్డి రూ. 7 లక్షల కోట్లు అప్పు, పన్నులు, ఛార్జీల బాదుడు వాస్తవం కాదా? అని నిలదీశారు. టీడీపీ సంక్షేమం పేదల్ని సొంత కాళ్లపై నిలబెట్టిందని, జగన్ రెడ్డి పేదల్ని బిచ్చగాళ్లని చేశారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. 'వైనాట్ 175 కాదు. వై నాట్ పులివెందుల' అని ప్రజలు అంటున్నారని, ఈసారి ఎన్నికల్లో జగన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని సొంత పార్టీ నేత డిఎల్ రవీంద్రారెడ్డి చెబుతున్నారన్నారు. జగన్ రెడ్డిని భరించలేమని రాష్ట్రంలోని పేదలంతా నినదిస్తున్నారని, ల్యాండ్-శాండ్-వైన్-మైన్ మాఫియాలకే జగన్ రెడ్డి కావాలి కానీ పేదలకు కాదన్నారు. జగన్ రెడ్డిని మించిన పెత్తందారు.. పేదల ద్రోహి ఎవరూ లేరని పేదలు గుర్తించారని, సీఎం జగన్ లక్షల కోట్ల దోపిడీపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు క్లాస్ వార్ చేస్తున్నారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.




# మద్యం ద్వారా రూ. 94వేల కోట్లు దోచుకున్న జగన్: అనిత

విశాఖ: తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత సీఎం జగన్‌పై కామెంట్స్ చేశారు. మద్యపాన నిషేధంపై ముఖ్యమంత్రి మాట తప్పారని.. మడమ తిప్పారని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 94 వేల కోట్లు మద్యం ద్వారా జగన్ దోచుకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె విశాఖలో మీడియాతో మాట్లాడుతూ ప్రజల రక్త మాంసాన్ని మద్యం ద్వారా తింటున్నారని, నాసిరకం మద్యం ద్వారా ప్రాణాలు తీసుకుంటున్నారని, మద్యపాన నిషేధం అమలు చేసిన తర్వాతే.. ఓట్లు అడుగుతామని అన్నారని.. ఆ దమ్ము జగన్‌కు ఉందా? అని అనిత సవాల్ చేశారు. జగన్ మద్యం బ్రాండ్‌లలో విషతుల్యం ఉందని, లేబరేటరీలో నివేదికలు అవే చెబుతున్నాయన్నారు. కల్తీ మద్యం తాగి కాలేయం, కిడ్నీ సమస్యలు వస్తున్నాయని, నాలుగేళ్లలో ఎన్నో పుస్తులు తెగాయని అనిత ఆవేదన వ్యక్తం చేశారు. జనాలు తాగి పడిపోవాలి.. చనిపోవాలనేది జగన్ కాన్సెప్ట్ అని విమర్శించారు. తాగుడు ద్వారా వచ్చే డబ్బులతో సంక్షేమం చేస్తున్నామని అంటారా?.. జగన్ చేసేవన్నీ వేదవ పనులని, ఇంటింటికీ డాక్టర్ పథకం ఒక బోగస్ అని, ఎంత మందికి మందులు ఇస్తున్నారు?.. ఆసుపత్రుల పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు జీతాలు రాక ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, చంద్రబాబు హయాంలో హ్యాపీ ఇండెక్స్ ఉంటే.. జగన్ హయాంలో స్ట్రెస్ ఇండెక్స్ ఉందని అనిత విమర్శించారు. ఆడపిల్లపై అఘాత్యాలు పెరిగిపోవడానికి కారణం మద్యమేనన్నారు. సంవత్సరానికి రూ. 5 వేల కోట్లు జగన్ దోచేస్తున్నారని ఆరోపించారు. గడప గడపకు జగనన్న మద్యం పథకం పెడితేసరి.. కోడి, గుడ్డు మీద ఉన్న శ్రద్ధ... మద్యపాన నిషేధంపై మంత్రి గుడివాడ అమర్‌కు లేదన్నారు. మద్యపాన నిషేధం అమలు చేయనప్పుడు.. నవరత్నాలు స్టిక్కర్‌లో మద్యపానం ఎందుకని అనిత ప్రశ్నించారు.




అప్పటి వరకు ఉల్లాసంగా సాగుతున్న ఓ మ్యూజిక్ ఫెస్టివల్‌లో ఆకాశం నుంచి రాకెట్లు దూసుకురావడం మొదలైంది. సంగీతాన్ని ఆస్వాదిస్తున్న అమాయక ప్రజలు ఆ ముప్పును గ్రహించలేకపోయారు. మరోవైపు డజన్ల కొద్దీ సాయుధ ముష్కరులు దూసుకొచ్చి కాల్పులు మొదలు పెట్టారు. దీంతో ప్రజలు ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగులు పెట్టారు.

కానీ, ఎగ్జిట్ ద్వారం చిన్నది కావడంతో ముష్కరులకు చిక్కి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యవసర ద్వారల వద్ద కూడా ముందుగానే ఉగ్రవాదులు నక్కి మరీ ప్రజలను చంపారు. ఇజ్రాయెల్‌పై హమాస్ ముష్కరులు జరిపిన దాడుల్లో మొత్తం 700 మంది ఇజ్రాయెలీలు చనిపోగా.. ఈ ఒక్క మ్యూజిక్ ఫెస్టివల్ ప్రాంగణంలోనే ఇప్పటి వరకు 260 మృతదేహాలను గుర్తించారు.

**వ్యాన్లలో 50 మంది ఉగ్రవాదులు..!** ఇజ్రాయెల్‌లో వ్యవసాయ పండుగ, యూదులు ఈజిప్ట్ నుంచి వలస రావడాన్ని స్మరించుకునే సందర్భాలు కలిసిరావడంతో వరుసగా సెలవులు వచ్చాయి. ఇవి ఏడు రోజులపాటు ఉంటాయి. ఈ సందర్భంగా ఇజ్రాయెల్-గాజా సరిహద్దు సమీపంలో నెగెవ్ ఎడారిలో కిబ్బుట్జ్ రీమ్ సమీపంలోని ఓ విశాల ప్రాంగణంలో 'ట్రైబ్ ఆఫ్ నోవా' కంపెనీ 'ది సూపర్ నోవా' పేరిట మ్యూజిక్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసింది. ఈ పార్టీకి సుమారు 3,000 మంది హాజరైనట్లు కాన్ న్యూస్ వెల్లడించింది. శనివారం ఉదయం పార్టీ జోరుగా సాగుతున్న సమయంలో రాకెట్ల దాడి మొదలైంది. కానీ, మ్యూజిక్ హోరులో వినిపించలేదు. అంతలోనే ఒక్కసారిగా ఎయిర్ డిఫెన్స్ సైరన్లు మోగడం మొదలైంది. ఆ తర్వాత విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కొన్ని నిమిషాల్లో పలు వ్యాన్లలో 50 మంది సాయుధ ముష్కరులు అక్కడికి వచ్చినట్లు ఓ బాధితురాలు ఛానల్12కు వెల్లడించారు. ఈ సమయంలో వీక్షకులపై తూటాల వర్షమే కురిసింది. ప్రజలు పారిపోవడానికి వీల్లేకపోవడంతో ఒక చోటకు వచ్చి ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. వాహనాల్లో ఎక్కి తప్పించుకొనేందుకు యత్నించినా.. అవి ముందుకు కదిలే పరిస్థితి లేదు. దీంతో వాటిని వదిలి పారిపోయారు.




## ఈవోగా కేఎస్ రామారావు.. ఇంద్రకీలాద్రిపై ఆధిపత్య పోరు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్నవేళ ప్రభుత్వం దుర్గగుడి ఈవో విషయంలో ఆటలాడుతోంది. ఓవైపు ఉత్సవాల ఏర్పాట్లు నత్తనడకన సాగుతుండగా.. వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఈవోలను మార్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా శ్రీకాళహస్తి ఆర్డీవో కేఎస్ రామారావును ఈవోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.




**విజయవాడ: స్కిల్ డెవలప్‌మెంట్ అక్రమ కేసులో రిమాండ్ ఉన్న తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ పిటిషన్ దాఖలు చేసిన మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడికి మరోసారి నిరాశ ఎదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్, కస్టడీ పిటిషన్లను న్యాయమూర్తి కొట్టివేశారు. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. మరోవైపు సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను కూడా న్యాయస్థానం కొట్టివేసింది.**





అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన మూడు ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఫైబర్‌నెట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు కేసుల్లో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై నేడు ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ మూడు కేసులపై హైకోర్టు ఇటీవల విచారణ పూర్తిచేసి తీర్పును రిజర్వు చేసింది. తాజాగా ఆయా కేసుల్లో తీర్పు వెల్లడించింది. ఏపీ రాజధాని నగ రానికి సంబంధించిన బృహత్ ప్రణా ళిక డిజైనింగ్, ఇన్నర్ రింగ్ రోడ్డు, దాన్ని అనుసంధానించే రహదారుల ఎలైన్‌మెంట్ వ్యవహారంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ గత ఏడాది మే 9న పలువురిపై కేసు నమోదు చేసింది. చంద్రబాబును మొదటి నిందితుడిగా సీఐడీ పేర్కొంది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ చంద్రబాబు పిటిషన్ వేశారు. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. సీఐడీ తరఫున ఏజీ శ్రీరామ్ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ నేడు తీర్పు వెలువరించింది. గత ప్రభుత్వ హయాంలో ఫైబర్ నెట్‌లో అక్రమాలు జరిగాయంటూ చంద్రబాబుపై సీఐడీ కేసు నమోదు చేసింది. దీనిపై ఆయన హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్ వాదించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలకు చంద్రబాబుని బాధ్యుడ్ని చేయడం సరికాదని ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. రాజకీయ కక్షతో మాత్రమే కేసు నమోదు చేశారని కోర్టుకు వివరించారు. రెండేళ్ల క్రితం కేసుపెట్టి చంద్రబాబుకు నోటీసులు ఇవ్వలేదని, హఠాత్తుగా ఆయన పేరును చేర్చారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ప్రాథమిక విచారణలో చంద్రబాబు పేరు లేదు కాబట్టి కేసులో లేరనడం సరికాదన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేశాక చంద్రబాబు ప్రమేయాన్ని గుర్తించినట్లు కోర్టుకు వివరించారు. ఇరు పక్షాల వాదనలు అనంతరం తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు.. తాజాగా ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

మరోవైపు అంగళ్లు ఘటనలో పోలీసులు నమోదు చేసిన కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరిట ఆగస్టు 4న అన్నమయ్య జిల్లాలో చంద్రబాబు పర్యటించారు. అంగళ్లు మీదుగా ఆయన వెళుతున్నప్పుడు వైకాపా శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడడం, తెదేపా కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో తెదేపా అధినేత చంద్రబాబు సహా ఆ పార్టీకి చెందిన మొత్తం 179 మంది నేతలపై కురబలకోట మండలం ముదివేడు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

# జబర్దస్త్ స్మైల్ తో కవ్వింపులు

జబర్దస్త్ మాజీ యాంకర్ అనసూయ మరోసారి హీరోయిన్ పీస్ అనిపించుకుంది. ఇద్దరు పిల్లలకు తల్లి అయినా కూడా రెగ్యులర్ కమర్షియల్ హీరోయిన్స్ కి ఏమాత్రం తగ్గకుండా అందాల ఆరబోత చేయడం మాత్రమే కాకుండా ఎప్పుడూ కూడా వార్తల్లో నిలిచే అనసూయ మరోసారి డీసెంట్ అందాల ఫోటో షూట్ ను షేర్ చేసి కన్నుల విందు చేసింది. అనసూయ ఈసారి చక్కని చిరు నవ్వుతో ఉన్న ఫోటోలను షేర్ చేసింది. స్టైలిష్ ఔట్ ఫిట్ లో అనసూయను చూస్తూ ఉంటే చూపు తిప్పుకోవాలి అనిపించడం లేదు అంటూ కొందరు ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తుంటే.. ఇంత అందంగా ఉన్న అనసూయ మేడంకు ఎందుకు సినిమాల్లో హీరోయిన్స్ ఆఫర్లు



రావడం లేదు అన్నట్లుగా ఫీల్ అవుతున్నారు. జబర్దస్త్ స్టైల్ ఔట్ ఫిట్ తో పాటు చక్కని స్మైల్ తో కవ్విస్తున్న అనసూయ మేడం ను ఓ రేంజ్ లో సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలను అనసూయ ఫ్యాన్స్ మాత్రమే కాకుండా చాలా మంది నిజంగా అను మేడం బాగుంది అంటూ లైక్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు. ఇలాంటి హాట్ ఫోటోలు మరియు వీడియో లను షేర్ చేస్తూ ఉంటే మరో పదేళ్ల పాటు అనసూయ మేడంకు ఇదే రేంజ్ లో క్రేజ్ ఉండటం ఖాయం. ముందు ముందు మరిన్ని ఐటం సాంగ్స్ లో నటించే అవకాశాలు రావడం తో పాటు స్టార్ హీరోల సినిమాల్లో రంగమ్మత్త రేంజ్ పాత్రలను కూడా చేసే అవకాశం ఉందని కామెంట్స్ వస్తున్నాయి.

## సుశాంత్ ని జీవితాంతం మిస్ అవుతూనే ఉంటాను

బాలీవుడ్ యంగ్ స్టార్ హీరో సుశాంత్ సింగ్ రాజ్ పూత్ మరణించి మూడేళ్లు కావస్తుంది. ఈ మూడు సంవత్సరాల్లో ఆయన గురించి రెగ్యులర్ గా ఏదో ఒక విషయమై చర్చ జరుగుతూనే ఉంది. ముఖ్యంగా సుశాంత్ సింగ్ రాజ్ పూత్ ప్రియురాలిగా పేరున్న రియా చక్రవర్తి గురించి రెగ్యులర్ గా ఏదో ఒక వార్త మీడియాలో ప్రచారం జరుగుతూనే ఉండటం మనం చూస్తున్నాం. ముఖ్యంగా సుశాంత్ చనిపోయిన సమయం లోనే రియా చక్రవర్తి డ్రగ్స్ కేసులో అరెస్ట్ అవ్వడం.. జైలుకు వెళ్లడం వంటివి జరిగింది. హీరోయిన్ గా కెరీర్ లో అప్పుడప్పుడే నిలదొక్కుకుంటూ ఉన్న హీరోయిన్ రియా



చక్రవర్తికి కెరీర్ లో పెద్ద డ్యామేజ్ గా సుశాంత్ మరణం నిలిచింది అనడంలో సందేహం లేదు. సుశాంత్ మరణం కు పూర్తిగా రియా చక్రవర్తి కారణం అన్నట్టుగా చాలా మంది ఆరోపించారు. ఆ సమయం లో రియా చక్రవర్తి కనీసం బయటకు కూడా రాలేక పోయింది. సుశాంత్ చనిపోయిన చాలా రోజుల తర్వాత రియా మళ్లీ సోషల్ మీడియాలో తన ఫోటోలు షేర్ చేయడం మొదలు పెట్టింది. అంతే కాకుండా ఆమె సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చింది. తాజాగా రియా చక్రవర్తి ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సుశాంత్ గురించి స్పందించింది. నా జీవితంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తిని కోల్పోయాను. ఆ బాధ నుంచి నేను జీవితాంతం బయటకు రాలేను. సుశాంత్ ని నేను జీవితాంతం మిస్ అవుతూనే ఉంటాను. సుశాంత్ చనిపోయిన సమయంలో చాలా కథనాలు వచ్చాయి. వాటి వల్ల నేను చాలా మిస్ అయ్యాను. కనీసం నేను ఏడవడానికి కూడా సమయం ఇవ్వకుండా విమర్శలు చేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఎన్నో సంఘర్షణలు ఎదుర్కొంటూ వచ్చాను. మళ్లీ సాధారణ స్థితికి రావడానికి చాలా సమయం పడుతుందని నాకు తెలుసు. ఈ సమయంలో నాకు ఆర్మీ ఆఫీసర్ అయిన మా నాన్న ఆదర్శం. ఆయన ఎంత పెద్ద కష్టం వచ్చి నా ఎదుర్కొని నిలవాలని చెప్పేవారు. ఆయన చెప్పినట్లుగానే తిరిగి సాధారణ స్థితికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంది. హీరోయిన్ గా రియా చక్రవర్తి పూర్వ వైభవం సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. మరి అది ఎంత వరకు వర్కౌట్ అయ్యేనో చూడాలి.




# దేవర 2.. 2026 ఫిక్స్ అవ్వొచ్చా..?



ఎన్టీఆర్ కొరటాల శివ కాంబో పెద్ద ప్లానింగ్ తోనే ఉన్నట్టు అర్థమవుతుంది. యువ సుధ ప్రొడక్షన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో ఈ మూవీ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన షూటింగ్ తోనే అవుట్ పుట్ అదిరిపోతుందని అంచనా వేస్తున్నారు. అంతేకాదు సినిమాలో ఎన్టీఆర్ పాత్ర నెక్స్ట్ లెవెల్ లో ఉండబోతుందని టాక్. అందుకే దేవర ఒక సినిమాగా చెప్పే కథ కాదు రెండు భాగాలు కావాల్సిందే అని డిసైడ్ అయ్యారు. దర్శకుడు కొరటాల శివ దేవర రెండు భాగాలని చెప్పి ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేశారు. ఇదిలా ఉంటే దేవర 1 ఏప్రిల్ 5, 2024 రిలీజ్ కన్ ఫర్మ్ చేయగా దేవర 2 రిలీజ్ ఎప్పుడు అన్నది ఫ్యాన్స్ టెన్షన్ పెట్టుకున్నారు. దేవర 1 తర్వాత నెక్స్ట్ ఇయర్ లోనే ఎన్టీఆర్ వేరే రెండు సినిమాలు కమిట్ అయ్యాడు. హృతిక్ రోషన్ తో వార్ 2.. ప్రశాంత్ నీల్ తో ప్రాజెక్ట్ ఈ రెండు ఒకదానికి మించి మరొకటి అన్నట్టుగా ఉన్నాయి. వార్ 2 ఆరు నెలల్లో పూర్తి చేసే అవకాశం ఉన్నా ప్రశాంత్ నీల్ సినిమా మాత్రం అంత ఈజీగా అయ్యేది కాదు. ప్రశాంత్ నీల్ సినిమా మొదలు పెడితే అది పూర్తి చేసే దాకా దానికే టైం కేటాయించాల్సి ఉంటుంది. ఈలోగా మరో సినిమా చేసే అవకాశం లేదు. సో అలా చూస్తే దేవర 2 2025 చివర కూడా కష్టమే 2026 లోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. ఎన్టీఆర్ ఎంత ప్రయత్నించినా సరే అనుకున్న టైం కు షూటింగ్ జరగడం, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరగడం లాంటివి కుదరాల్సి ఉంటుంది. సో అందుకే దేవర 2 కోసం మరో 3 ఏళ్లు వెయిట్ చేయక తప్పదు. దేవర 1 సెన్సేషనల్ హిట్ అయితే దేవర 2 గురించి ఫ్యాన్స్ ఎగ్జైట్మెంట్ ఎక్కువ అవుతుంది.

అల్లు అర్జున్ పుష్ప 1 కూడా 2021 లో వచ్చింది. ఆ సినిమా సెకండ్ పార్ట్ 2024 ఆగష్టు లో అంటున్నారు. సో క్యారెక్టర్ ఆడియన్స్ మైండ్ లో రిజిస్టర్ చేసేలా ఉంటే ఈ గ్యాప్ పెద్ద లెక్కేమి కాదు. పుష్ప 2 మీద బజ్ ఎలా ఉందో ఈమధ్య వచ్చిన పోస్టర్, టీజర్ కి వచ్చిన రెస్పాన్స్ చూసే అర్థం చేసుకోవచ్చు. అలా దేవర పాత్రని కూడా కొరటాల ఆడియన్స్ లో గుర్తుండిపోయేలా చేస్తే దేవర 2 కోసం రెండేళ్లు కాదు ఎన్నేళ్లయినా ఎదురుచూస్తారు.

# సంక్రాంతి పోటీలో నలిగి పోయేది ఎవరో...!



ప్రతి ఏడాది సంక్రాంతికి స్టార్ హీరోల సినిమాలు చిన్న హీరోల సినిమాలు విడుదల అవ్వడం కామన్. 2023 సంక్రాంతికి చిరంజీవి మరియు బాలయ్య లు పోటీ పడ్డ విషయం తెల్సిందే. తమిళ్ మూవీ వచ్చినా కూడా చిరు, బాలయ్య లు ఆ డబ్బింగ్ సినిమాను కనిపించకుండా చేశారు. ఇక 2024 సంక్రాంతి సినిమాల గురించి ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రభాస్ 'కల్కి' సినిమాను విడుదల చేయాలని భావించారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా వచ్చే పరిస్థితి లేదు. దాంతో ఇతర సినిమాలు చాలానే సంక్రాంతి బరిలో దిగబోతున్నాయి. ఇప్పటికే మహేష్ బాబు గుంటూరు కారం సినిమా ను సంక్రాంతికి విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కచ్చితంగా సంక్రాంతికి త్రివిక్రమ్, మహేష్ బాబులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంక్రాంతికి నాగార్జున నటిస్తున్న 'నా సామిరంగా' సినిమా విడుదల కాబోతుంది.

లషూటింగ్ ప్రారంభం సమయంలోనే సంక్రాంతికి వచ్చి తీరుతాం అంటూ మేకర్స్ ప్రకటించడంతో కచ్చితంగా నాగ్ సినిమా సంక్రాంతికి వచ్చే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. తాజాగా సంక్రాంతికి విడుదల అవుతున్న సినిమాల జాబితాలో సైంధవ్ కూడా చేరింది. వెంకటేష్ హీరోగా నటిస్తున్న సైంధవ్ సినిమా ను సంక్రాంతి కానుకగా విడుదల చేయడం ద్వారా పోటీ మరింత రసవత్తరంగా మారబోతుంది. నాగార్జున మరియు వెంకటేష్ లు గతంలో బాక్సాఫీస్ వద్ద పోటీ పడ్డ సందర్భాలు ఉన్నాయి. అందులో ఎక్కువ శాతం వెంకటేష్ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. అయితే ఈసారి వీరిద్దరితో పాటు మరి కొన్ని సినిమాలు కూడా రాబోతున్నాయి. సంక్రాంతికి ఇంకా మూడు నెలల సమయం ఉంది కనుక ఇప్పటికే కమిట్ అయిన సినిమాలు వాయిదా పడవచ్చు.. మరికొన్ని సినిమాలు వచ్చి చేరినా చేరవచ్చు. కనుక ఈ సంక్రాంతి పోటీలో హిట్ గా నిలిచే సినిమాలు ఏంటి... నలిగి పోయే సినిమాలు ఏంటి అనేది తెలియాలంటే మరి కొన్నాళ్లు వెయిట్ చేయాల్సిందే.

# 'రెడ్' బ్యూటీ క్లీవేజ్, థైస్ షో తో కన్నుల విందు

రవితేజ హీరోగా నటించిన నేల టికెట్ సినిమా తో తెలుగు ప్రేక్షకులకు మాళవిక శర్మ హీరోయిన్ గా పరిచయం అయిన విషయం తెల్సిందే. మొదటి సినిమానే డిజాస్టర్ అవ్వడంతో ముద్దగుమ్మ తిరిగి కోలుకోలేక పోయింది. అయితే చాలా గ్యాప్ తర్వాత రామ్ తో కలిసి 'రామ్' సినిమాలో నటించే అవకాశంను మాళవిక శర్మ దక్కించుకుంది. రామ్ తో నటించిన 'రెడ్' సినిమా కూడా నిరాశ పరిచింది. దాంతో ఈమెకు ఆఫర్లు వస్తాయా అనుకుంటూ ఉండగా లక్కీగా ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. అందాల ఆరబోత విషయం లో ఈ అమ్మడు ఏ మాత్రం



వెనక్కి తగ్గకుండా అందాల విందు చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోతతో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. ఒక రెస్టారెంట్ లో డిమ్ లైట్ లో ఈ అమ్మడు క్లీ వేజ్ షో చేస్తూ, థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తున్న మాళవిక శర్మ అందాలను నెటిజన్స్ చూస్తూ చూపు తిప్పుకోలేక పోతున్నాం అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్ అందాల ఆరబోతకు స్టార్ హీరోల సినిమాల్లో నటించే ఛాన్స్ లు రావాల్సిన అవసరం ఉంది అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతానికి తెలుగు లో ఒక సినిమాను చేస్తున్న మాళవిక ముందు ముందు మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆకట్టుకునే ఫిజిక్ ఈ అమ్మడి సొంతం. ముందు ముందు ఆ ఫిజిక్ మరియు అందాలతో మాళవిక టాలీవుడ్ తో పాటు ఇతర భాషల సినీ ఇండస్ట్రీలో ఆఫర్లు దక్కించుకునే అవకాశం ఉందని మీడియా సర్కిల్స్ వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## తగ్గేదే లే... మిల్కీ బ్యూటీ బికినీ షో

మిల్కీబ్యూటీ తమన్నా కెరీర్ ఆరంభించి దాదాపుగా రెండు దశాబ్దాలు అవుతోంది. అయినా కూడా ఇప్పటికి ఏదో ఒక ప్రాజెక్ట్ తో బిజీగానే ఉంటోంది. సినిమాలు.. సిరీస్ లు.. ఐటెం సాంగ్స్.. చివరికి వీడియో ఆల్బం ల్లో కూడా తమన్నా కనిపిస్తూ తన అభిమానులకు కన్నుల విందు చేస్తుంది. స్కిన్ షో విషయం లో మిల్కీ బ్యూటీ అస్సలు తగ్గడం లేదు. తాజాగా మరోసారి తగ్గేదే లే అన్నట్లుగా తన అందాల ఆరబోత చేసింది. జైలర్ సినిమా తో పాటు ఇటీవల లస్ట్ స్టోరీస్ 2 లో కూడా మిల్కీ బ్యూటీ తమన్నా సంచలన అందాలను షో చేసింది. ఆ అందాల ఆరబోతకు ఫ్యాన్స్ తో పాటు అంతా కూడా షాక్ అయ్యారు. వయసు పెరుగుతున్నా కొద్ది మిల్కీ బ్యూటీ అందం పెరుగుతుందనే టాక్ వచ్చింది. తాజాగా బికినీతో మిల్కీ బ్యూటీ సర్



ప్రైజ్ చేసింది. ఒక ప్రముఖ బ్రాండ్ ప్రమోషన్ కోసం తమన్నా బికినీ ధరించింది. అందుకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో గతంలో పలు సార్లు బికినీతో సర్ ప్రైజ్ చేసిన మిల్కీ బ్యూటీ తమన్నా మరోసారి బికినీ అందాలతో కన్నుల విందు చేసింది. టూ పీస్ బికినీ లో మిల్కీ బ్యూటీ ఇంకా కూడా తన అందం ఏమాత్రం తగ్గలేదు.. నేను యంగ్ హీరోలకు జోడీగా సినిమాలు చేయగల సత్తా ఉన్న నటిని అన్నట్లుగా ధీమాతో చెప్పకనే చెప్పింది. మొత్తానికి మిల్కీ బ్యూటీ బికినీ షో తో మరో అయిదు పది సంవత్సరాల పాటు ఇండస్ట్రీలో కొనసాగే అవకాశాలు ఉన్నాయి అన్నట్టుగా నెటిజన్స్ మాట్లాడుకుంటున్నారు.



# తెలంగాణలో ఎన్నిక ఏకపక్షమే.. మూడోసారి కూడా బీఆర్ఎస్‌దే విజయం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్(ట్విట్టర్) వేదికగా స్పందించారు. ఇప్పటి వరకు తెలంగాణలో జరిగిన ఎన్నికలన్నీ ఏకపక్షమే అని.. ఈ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ భారీ విజయం సాధించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత రెండు ఎన్నికల్లో నిండు మనసుతో ప్రజలు బీఆర్ఎస్‌ను ఆశీర్వదించారు.. ముచ్చటగా మూడోసారి కూడా ఆశీర్వదిస్తారని, మనదే విజయం అని విశ్వాసం వ్యక్తం చేశారు కేటీఆర్. డిసెంబర్ మూడో తేదీన ముచ్చటగా, మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు దక్షిణ భారతదేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించబోతున్నాయని, దక్షత గల నాయకత్వానికే మరోసారి పట్టం కట్టబోతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. హ్యాట్రిక్ విక్టరీ ఖరారు.. ప్రతిపక్షాలు బేజారు కావడం ఖాయమన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో.. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు గుండె గుండెలో గులాబీ జెండా ఎగురుతోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో గాంధీ సిద్ధాంతం తప్ప.. ఈ గడ్డపై గాడ్సే రాద్ధాంతం నడవదు అని తేల్చిచెప్పారు. 2014లో ఉద్యమ చైతన్యంతో, 2018లో సంక్షేమ సంబురంతో గెలిచాం. 2023లో మూడో ఎన్నికను శాసించేది.. ముమ్మాటికీ మన పదేండ్ల సమగ్ర ప్రగతి ప్రస్థానం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎన్నికల సమరానికి బీఆర్ఎస్ సర్వసన్నద్ధంగా ఉందని, యుద్ధానికి ముందే కాంగ్రెస్ అస్త్రసన్యాసం తీసుకుందని, పోటీకి ముందే పూర్తిగా కమలం కాడి పడేసిందని కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ తన పాత రికార్డులు తిరగ రాయడం ఖాయం.. ఈ సారి సెంచరీ కొట్టడం తథ్యం.. అఖండ విజయం మనదే అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# 15న బీఆర్ఎస్ అభ్యర్థులతో సీఎం కేసీఆర్ భేటీ..! అదేరోజు మేనిఫెస్టో ప్రకటన..!



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ నెల 15న భారత రాష్ట్ర సమితి అభ్యర్థులతో సమావేశంకానున్నారు. తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో అభ్యర్థులకు బీ ఫారాలను అందజేయనున్నారు. ఇక అదేరోజున పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించనున్నారు. అదే రోజు నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. 15న సాయంత్రం హైదరాబాద్ నుంచి బయలుదేరి.. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 16న జనగామ, భువనగిరి నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే బహిరంగ సభలకు హాజరవుతారు. 17న సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లో జరిగే సభలకు హాజరవుతారు. 18న మధ్యాహ్నం 2 గంటలకు జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో జరిగే మీటింగ్‌లో, సాయంత్రం 4 గంటలకు మేడ్చల్‌లో జరిగే సభకు హాజరై ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు.

# నేడు తెలంగాణకు కేంద్రమంత్రి అమిత్ షా.. పర్యటన షెడ్యూల్ ఇదే



హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోసారి తెలంగాణకు రానున్నారు. ఈ నెల 10వ తేదీన అమిత్ షా రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి అధికారిక షెడ్యూల్ ఖరారైంది. రేపు మధ్యాహ్నం ఆదిలాబాద్‌లోని డైట్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగసభలో అమిత్ షా పాల్గొనున్నారు. ఇప్పటికే ఈ నెల 1న మహబూబ్‌నగర్, 3న నిజామాబాద్‌లో నిర్వహించిన సభల ద్వారా రాష్ట్రంలో పార్టీపరంగా ప్రధాని మోదీ ఎన్నికల శంఖాన్ని పూరించిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా అమిత్ షా సభను బీజేపీ నిర్వహించనుంది. కాగా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్‌లో అదేరోజు సాయంత్రం అమిత్ షా సభ నిర్వహించాలని తొలుత భావించింది. అయితే ఈ సభ రద్దు అయింది. దీనికి బదులు సాయంత్రం సికింద్రాబాద్ సిఖ్ విలేజీలోని ఇంపీరియల్ గార్డెన్‌లో జరిగే మేధావుల సదస్సులో అమిత్ షా పాల్గొనున్నారు. 6.20 నుంచి 7.20 వరకు ఈ భేటీ కొనసాగనుంది. అదేవిధంగా సాయంత్రం తెలంగాణ బీజేపీ ముఖ్యనేతలతో అమిత్‌షా సమావేశం కానున్నారు. రాత్రి 7.40 గంటలకు ఐటీసీ కాకతీయలో రెండు గంటలపాటు ఈ భేటీ జరగనుంది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు. పరిస్థితులపై చర్చించే అవకాశం ఉంది.

**అమిత్ షా షెడ్యూల్:** మధ్యాహ్నం 1.45 కు బేగంపేట ఎయిర్ పోర్ట్‌కు అమిత్ షా, 2.35కు ప్రత్యేక హెలికాప్టర్ లో ఆదిలాబాద్ చేరుకుంటారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఆదిలాబాద్ సభలో పాల్గొననున్నారు. 4.15 కు ఆదిలాబాద్ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయలుదేరనున్నారు.

5.05 బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. 5. 20 నుంచి 6 గంటల ఐటీసీ కాకతీయలో సమావేశం, 6 గంటలకు ఇంపీరియల్ గార్డెన్‌కు బయల్దేరనున్నారు. 6.20 నుంచి 7.20 వరకు ఈ భేటీ కొనసాగనుంది. రాత్రి 7 గంటల 40 నిమిషాలకు ఐటీసీ కాకతీ యలోబీజేపీ ముఖ్యనేతలతో అమిత్ షా సమావేశం, రెండు గంటల పాటు కొనసాగనున్న భేటీ, రాజకీయ పరిణామాలు. రాష్ట్రంలో పరిస్థితులపై చర్చించే అవకాశం, 9.40 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి తిరిగి ఢిల్లీ వెళ్లనున్నారు.

# కొన్ని పార్టీలు ఓట్లను చీల్చే ప్రయత్నాలు చేస్తున్నాయి



ఢిల్లీ: కొన్ని పార్టీలు ఓట్లను చీల్చే ప్రయత్నాలు చేస్తున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నాడు రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.."ఎంఐఎం నేతలు అక్బరుద్దీన్, అసదుద్దీన్‌లు ఎటువైపు ఉన్నారో సమాధానం చెప్పాలి. ఇద్దరు ఒకరితో ఒకరు సహకరించుకోవాలని అనుకున్నట్లు ఇద్దరు నేతలు అంగీకరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పింది అబద్ధమైతే సీఎం కేసీఆర్ ఎందుకు ఖండించలేదు. అందుకే 105 స్థానాల్లో బీజేపీ డిపాజిట్లు కోల్పోయింది. 2018 ఎన్నికల్లో బీజేపీ ఓటు టీఆర్ఎస్‌కు బదిలీ అయింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాల్సిన ఎంపీ స్థానాల్లో బీజేపీ బీఆర్ఎస్ సహకారంతో గెలిచింది. దివంగత నేత వాజ్‌పాయినికూడా రాజకీయ స్వలాభం కోసం వాడుకున్నారు. తెలంగాణలో బీజేపీకి ఏం ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జేపీ నడ్డాలు ఎందుకు వస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల కుట్రలను తెలంగాణ ప్రజలు తిప్పికొట్టాలి. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో తెలంగాణకు పట్టిన పీడా నుంచి విముక్తి లభించబోతుంది. తెలంగాణ ప్రజలు సంబరాలు జరుపుకోవాలి. దసరాను ఘనంగా నిర్వహించుకోవాలి. కేసీఆర్ ముక్త తెలంగాణకు ప్రజలందరూ ముందుకు రావాలి. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక ఆరు గ్యారెంటీల మీదే తొలి సంతకం చేస్తాం. 6 గ్యారెంటీలు తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగు తీసుకురాబోతున్నాయి. విజయదశమి నుంచి కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టేలా కార్యచరణ రూపొందించాం. అభ్యర్థుల ఎంపిక కాంగ్రెస్ ప్రాధాన్యత కాదు, ప్రజలకు ఏం ఇవ్వాలనేదే మా ప్రాధాన్యత. అభ్యర్థుల ఎంపికపై మాకు ఎత్తుగడ ఉంది, ఆరు గ్యారెంటీలే మా అభ్యర్థులని గెలిపిస్తాయి. కేసీఆర్ తెలంగాణలో లక్షకోట్లు, 10 వేల ఎకరాలు దోచుకున్నాడు. అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహం, సచివాలయం నిర్మాణంలో కూడా అవినీతికి పాల్పడ్డారు. సోనియాగాంధీ ఆరు గ్యారెంటీలు ప్రకటించిన మరుసటి రోజు నుంచే కేసీఆర్ కనిపించకుండాపోయాడు. సోనియా గాంధీ హామీలను చూసే కేసీఆర్‌కు చలిజ్వరం వచ్చింది. వచ్చే ఎన్నికలను ప్రజాతీర్పు నిర్ణయిస్తుంది. కేసీఆర్ ఫామ్‌హౌస్ వదిలి రావాల్సిన అవసరం లేదు. ఆయన రెస్ట్ తీసుకోవాల్సిన సమయం వచ్చింది. డిసెంబర్‌లో మరో అద్భుతం అవిష్కరించబోతుంది. కాంగ్రెస్ అధికారంలోకి రావడమే అద్భుతం. కేసీఆర్ కుటుంబం అందినకాడికి దోచుకుంది. అమరవీరులు, యువత, మహిళలు ఇలా ప్రతిఒక్క వర్గం సంబరం చేసుకోవాల్సిన సమయం ఇది.

కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం. ప్రతిపేదవాడి ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తాం. మద్యం దుఖాణాలతో ప్రజల ఆరోగ్యంతో చెలాగటాలు ఆడాడు. సంపద పెంచాలి, పేదలకు పంచాలి అనేది కాంగ్రెస్ విధానం. కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసహనంతో ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, ఫీజ్ రియింబర్స్‌మెంట్, విద్యుత్ బకాయిలు, మెట్రో నిర్మాణం, ఐటీ కంపెనీలు ఇలా ఏ అంశం మీదనైన చర్చకు మేము సిద్ధం. మా మేనిఫెస్టో మేము తెస్తాం, దమ్ముంటే మీరు చర్చకు రావాలి. బీఆర్ఎస్, బీజేపీ నేతలు తేదీ నిర్ణయిస్తే అమరవీరుల స్థూపం వద్ద చర్చకు నేను సిద్ధం. ఎన్నికల ప్రచారం, బస్సు యాత్రల్లో కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొంటారు" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రాష్ట్రంలో భూమికి బరువు అయ్యేంత పంట పండుతుంది

సిద్దిపేట జిల్లా: అర్బన్ మండలం, మిట్టపల్లి శివారులో స్వయం ఉపాధి శిక్షణ పొందే మహిళా ప్రాంగణం, వృద్ధాశ్రమం, జిల్లా మహిళా సమాఖ్య భవనాలను మంత్రి హరీష్ రావు సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జెడ్పీ చైర్మన్ రోజా శర్మ, ముఖ్య అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూమికి బరువు అయ్యేంత పంట పండుతుందని, గతంలో ఎరువు బస్తా కోసం చెప్పులను క్యూ లైన్‌లో పెట్టేవారని.. ఇప్పుడాపరిస్థితి లేదని అన్నారు. గతంలో మనం కూలికి వెళ్ళేవాళ్ళమని, ఇప్పుడు పక్క రాష్ట్రాల వారికి కులీ ఇచ్చే పరిస్థితికి చేరుకున్నామన్నారు.

సీఎం కేసీఆర్ మాట ఇస్తే తప్పరని, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని, కొందరు నాలుకకు నరం లేదనీ ఇష్టం వచినట్టు మాట్లాడుతారని అన్నారు. పొరపాటున కాంగ్రెస్ చేతిలో రాష్ట్రాన్ని పెడితే వైకుంఠపాళి ఆటలో పెద్దపాము మింగినట్టేనని, వీవోఏలను అదుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఉద్యోగస్తులకు పీఆర్సీ కల్పించామన్నారు. బీజేపీ గ్యాస్ ధరను అడ్డగోలుగా పెంచిందని, దాన్ని తగ్గించే ప్రయత్నం సీఎం కేసీఆర్ చేస్తున్నారని, ఏ పథకం అయినా మహిళ పేరిట పెడితే సద్వినియోగం అవుతుందనీ కేసీఆర్ మహిళల పేరిట పథకాలు తెచ్చారని హరీష్ రావు కొనియాడారు. వయో వృద్ధులను ఈ వృద్ధాశ్రమంలో కన్న తల్లిదండ్రులవలే చూసుకుంటామన్నారు.

క్షణికావేశంలో మహిళలు ప్రాణప్రాయ నిర్ణయాలు తీసుకోవద్దని.. భరోసా, సఖి సెంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. 120 మంది ఉండేలా మహిళా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మించామని, బాల రక్ష భవన్‌లో 6 ఏళ్ల నుంచి 18 ఏళ్ల ఆడపిల్లలకు రక్షణ ఇస్తారని, తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలకు శిశుగృహ కేంద్రంలో రక్షణ ఇస్తున్నామని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.




శంషాబాద్: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బెదిరింపు మెయిల్ వచ్చింది. హైదరాబాద్- దుబాయ్ విమానాన్ని హైజాక్ చేయబోతున్నట్లు దుండగులు అందులో పేర్కొన్నారు.

దీంతో విమానాశ్రయ భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. కాసేపట్లో రన్‌వే పైనుంచి బయల్దేరనుండగా ఆ విమానాన్ని నిలిపేసి ప్రయాణికుల లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించిన తర్వాత తిరుపతి, వినోద్, రాకేశ్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

ఆ ముగ్గురూ దుబాయ్ మీదుగా ఇరాక్ వెళ్తున్నట్లు గుర్తింఆచరు. ఆ తర్వాత వారిని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. అనంతరం విమానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రయాణికులను మరో విమానంలో దుబాయ్ పంపించనున్నట్లు తెలిపారు.

# ఎన్నికల వ్యూహంలో భాగంగానే ఆలస్యంగా అభ్యర్థుల ప్రకటన: కిషన్‌రెడ్డి



సికింద్రాబాద్: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. తెలంగాణ భాజపా సిద్ధంగా ఉందని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణలో నాలుగు రైలు సర్వీసుల పొడిగింపును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. అభ్యర్థులను ఎప్పుడు ప్రకటించాలన్నది తమ ఇష్టమని.. నామినేషన్ చివరి వరకు కూడా అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎన్నికల వ్యూహంలో భాగంగానే ఆలస్యంగా అభ్యర్థులను ప్రకటించనున్నామన్నారు. ఇప్పటికే 50 శాతం వరకు అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసినట్లు వివరించారు. "ఇప్పటికే రెండు సార్లు ప్రధాని తెలంగాణకు వచ్చారు. కేంద్ర మంత్రులు, భాజపా నాయకులు త్వరలో ప్రచారానికి వస్తారు. భాజపా అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. రాష్ట్రంలో రైల్వే కోసం కేంద్రం ?33వేల కోట్లు ఖర్చు చేస్తుంది. హైదరాబాద్‌కు కొత్త రైల్వే టెర్మినల్ వస్తోంది. జనవరిలో చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను జాతికి అంకితం చేస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్‌లో కొన్ని పనులు పెండింగ్ ఉన్నాయి. రెండో ఫేజ్‌లో కొత్త మార్గాలను వేగంగా పూర్తి చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగిస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్ కోసం రైల్వే బోర్డు నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఉంటే త్వరగా పనులు పూర్తి చేస్తాం. రైల్వే మ్యానుఫ్యాక్చర్ యూనిట్‌కు భూమిపూజ చేశాం. ఆర్‌ఎంయూ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి" అని కిషన్ రెడ్డి తెలిపారు.

# మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నిక వివాదంపై తీర్పు రేపటికి వాయిదా



హైదరాబాద్: తెలంగాణ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నిక వివాదంపై తీర్పు మంగళవారానికి వాయిదా పడింది. ఈ మేరకు తీర్పును వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర హైకోర్టు వెల్లడించింది. శ్రీనివాస్ గౌడ్ ఎన్నిక చెల్లదంటూ 2019లో మహబూబ్‌నగర్‌కు చెందిన రాఘవేంద్రరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శ్రీనివాస్‌గౌడ్ 2018లో సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులు, అప్పుల గురించి తప్పుడు సమాచారం అందించారని రాఘవేంద్రరాజు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఎన్నికల అఫిడవిట్‌ను ఒకసారి రిటర్నింగ్ అధికారికి సమర్పించి.. మళ్లీ వెనక్కి తీసుకుని సవరించి అందజేశారని పేర్కొన్నారు. ఇది చట్టవిరుద్ధమని.. ఆయన ఎన్నికను రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు.




# ఈనెల 15 నుంచి టీకాంగ్రెస్ బస్సు యాత్ర

హైదరాబాద్: ఈనెల 15వ తేదీ నుంచి తెలంగాణ కాంగ్రెస్ బస్సు యాత్ర ప్రారంభం కానుంది. 10 రోజుల్లో రాష్ట్రం మొత్తం బస్సు యాత్ర చుట్టేయనుంది.

15న అలంపూర్ నుంచి బస్సు యాత్ర ప్రారంభం కానుంది. 10 రోజుల షెడ్యూల్‌లో 10 రోజుల పాటు బస్సు యాత్రలో ఏఐసీసీ అగ్ర నేతలు పాల్గొంటారు. 15, 16 తేదీలలో బస్సుయాత్రలో ప్రియాంక గాంధీ పాల్గొంటారు. అలాగే 18,19 తేదీలలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బస్సు యాత్రలో పాల్గొననున్నారు.

20, 21 తేదీలలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొంటారు. మిగతా నాలుగు రోజులలో కర్నాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై బులిటెన్ విడుదల చేయాలి



హైదరాబాద్: సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై బులిటెన్ విడుదల చేయాలని బీజేపీ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం నాడు బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.."సీఎం కేసీఆర్‌పై కుటుంబ సభ్యుల ఒత్తిడి ఉంది.

తనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని మంత్రి కేటీఆర్ తన తండ్రి కేసీఆర్‌ను ఒత్తిడి చేస్తున్నారు. తమ ముఖ్యమంత్రి ఆరోగ్యం గురించి తెలుసుకునే హక్కు ప్రజలకుంది. సీక్రెట్‌గా ఉంచడం వల్ల కాన్షీరాం, జయలలిత ఆరోగ్యం ఏమైందో అందరికీ తెలుసు. కాన్షీరాం, జయలలిత మరణాలపై పలు అనుమానాలున్నాయి. సీఎం కేసీఆర్ ఆరోగ్యం బులిటెన్ విడుదల చేసేలా సీఎస్‌కు ఆదేశాలివ్వాలని గవర్నర్‌కు లేఖ రాశాను" అని మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# చంద్రబాబు విడుదల కోసం చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు

హైదరాబాద్ : టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టు నుంచి త్వరగా విడుదలై మళ్ళీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలు అందించాలని కోరుతూ చిలుకూరు బాలాజీ దేవాయంలో పలువురు పూజలు నిర్వహించారు. చేవెళ్ల టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు గూడెం సుభాష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కొమ్మిడి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి, పరిగి చంద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేతి జగదీష్ రెడ్డి, దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షులు పొలంపల్లి అశోక్, శేరిలింగంపల్లి ఇంచార్జ్ కట్టా వెంకటేష్ గౌడ్ తదితరులు పూజలో పాల్గొన్నారు. చంద్రబాబు వెంటనే విడుదల కావాలని సుప్రీంకోర్టులో న్యాయం జరిగాలని వేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్టు తెలిపారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com